## సీతారాముల కళ్యాణం...
## ముస్తాబైన కళ్యాణ రామచంద్రస్వామి దేవాలయం

**రామాయంపేట, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** రామాయంపేట మండలకేంద్రంలోని పాండచెరువుకట్ట వద్ద ఉన్న కళ్యాణ రామచంద్రస్వామి దేవాలయం 21వ వార్షికోత్సవ వేడుకలకు సిద్ధమైంది. శ్రీరామనవమి పురస్కరించుకొని ఐదురోజులపాటు వార్షికోత్సవ వేడుకలను నిర్వహించనున్నారు. ఈనెల ఆరవ తేదీన శ్రీకళ్యాణరామచంద్రస్వామి కళ్యాణమహోత్సవం కార్యక్రమాన్నినిర్వహించేందుకు ఆలయకమిటీసభ్యులు ఏర్పాట్లుచేశారు. ఆలయంలో సోమవారంనుండి అధ్యయనోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 5వ తేదీన శ్రీసీతారాముల ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. ఆరవతేదీ ఆలయప్రాంగణంలో కళ్యాణంనిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు. అదేరోజు సాయంత్రం శ్రీకళ్యాణ రామచంద్రస్వామి ఉత్సవవిగ్రహాలకు శోభాయాత్ర కార్యక్రమాన్ని చేపట్టేందుకు ఏర్పాట్లుచేసినట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా స్థానిక ఎస్ఐ బాలరాజు ఏర్పాట్లను పరిశీలించారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

## భారతరాజ్యాంగ సవరణను బిజెపిసర్కారు ఉపసంహరించాలి
**-పాదయాత్రలో నియోజకవర్గ ఇంచార్జి హరికృష్ణ**

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులకు, మైనార్టీలకు, పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ అన్నారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ నినాదంతో జరుగుతున్న పాదయాత్రలో భాగంగా గురువారం సిద్దిపేట అర్బన్ మండలపరిధిలోని తడకపల్లి, ఎన్సాన్‌పల్లి, సిద్దిపేటరూరల్ మండలం తోర్నాల గ్రామాలలో అనసాన్‌పల్లిని మాట్లాడారు. భారతరాజ్యాంగాన్ని సవరించడం అనేనిర్ణయాన్ని బిజెపిసర్కారు వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కాంగ్రెస్‌హయాంలోనే అన్నివర్గాల అన్నిమతాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. రాజ్యాంగంజోలికి రావొద్దని, వస్తే దేశవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉద్ధృతం అవుతాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.డి.ఇమామ్(అత్తు), గంప మహేందర్‌రావు, అంజయ్య, సతీష్, భిక్షపతి, లక్ష్మీ, కవిత తదితరులు పాల్గొన్నారు.

## మాజీమంత్రిని కలిసిన కార్పొరేటర్



మాజీమంత్రి హరీష్‌రావుని కలిసి పుష్పగుచ్చం అందచేస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
మాజీమంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును గురువారం భారతీనగర్ కార్పొరేటర్ వెన్నవరం సింధూ, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఆదర్శ్‌రెడ్డిని బిఆర్ఎస్‌పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా నియమించినందుకు కృతజ్ఞతగా హరీష్‌రావును కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హరీష్‌రావు సింధూ ఆదర్శ్‌రెడ్డిలకు వివరించారు.

## తహసీల్దార్ కార్యాలయ తనిఖీ చేసిన కలెక్టర్




తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యాలయానికి సంబంధించిన వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. భూసమస్యలను పరిష్కరించాలని తెలిపారు.

## ఓపెన్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లుచేయాలి
**-అదనపు కలెక్టర్ చంద్రశేఖర్**



సమావేశంలో మాట్లాడుతున్న అదనపుకలెక్టర్ చంద్రశేఖర్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
ఓపెన్ 10వ తరగతి మరియు ఇంటర్ పరీక్షల నిర్వహణకు అవసరమైన పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపుకలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం సంగారెడ్డి కలెక్టర్ నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల తొమ్మిదినుంచి జరిగే ఓపెన్ పది, ఇంటర్మీడియట్ పరీక్షలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. పరీక్షలు ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు, రెండోవిడత మధ్యాహ్నం రెండున్నర గంటలనుండి ఐదున్నర గంటలవరకు జరుగుతాయని అన్నారు. సమావేశంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## చిన్నారుల పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాలి
**-బాధ్యులకు న్యాయమూర్తి రమేష్ సూచన**



సంగారెడ్డిలో బాలసదనంను సందర్శించిన న్యాయమూర్తి రమేష్

**సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
జిల్లాకేంద్రమైన సంగారెడ్డిపట్టణంలోని బాలసదనం, శిశుగృహ, సఖి, భరోసాకేంద్రాలను జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి బి.రమేష్ గురువారం సందర్శించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ పిల్లలకు అన్నిచట్టాలపై అవగాహన ఉండాలన్నారు. చిన్నారుల బాగోగులపై ప్రత్యేక దృష్టిని సారించాలని బాధ్యులకు సూచించారు. ఉపాధ్యాయులు న్యాయపరమైన విషయాలలో ఉచిత న్యాయసహాయం అందిస్తామని, ఉపాధ్యాయులు అవసరమైతే సంగారెడ్డిలోని న్యాయ సేవాధికారసంస్థ కార్యాలయాన్ని సంప్రతించి సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి రమేష్ సిబ్బందికి సూచించారు.

## ఘనంగా వాజ్‌పేయి శతజయంతి వేడుకలు
**-నియోజకవర్గంలో ప్రతి రేషన్ దుకాణాన్ని బిజెపి కార్యకర్తలు సందర్శించాలి**
**-బిజెపి జిల్లా అధ్యక్షులు వల్దాస్ మల్లేష్‌గౌడ్**

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో రేషన్‌దుకాణాన్ని బిజెపి కార్యకర్తలు సందర్శించాలని, బిజెపి రాష్ట్రకమిటీ ఆదేశాలమేరకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మీసాల చంద్రయ్య తెలిపారు. గురువారం మెదక్‌పట్టణంలోని బిజెపి కార్యాలయంలో మాజీప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలుఘనంగానిర్వహించారు. ఈకార్యక్రమానికి బిజెపిరాష్ట్రనాయకులు, రాష్ట్ర కౌన్సిలింగ్ నెంబర్ మీసాల చంద్రయ్య, రాగి రాములు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి చేతులమీదుగా మెదక్ నియోజకవర్గంలో భారతీయజనతాపార్టీ కోసం గతంలో అలుపెరుగని కృషి చేసిన నాయకులను ఆహ్వానించి బిజెపినాయకుల ఆధ్వర్యంలో గౌరవంగా సన్మానించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్రకార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ వాజ్‌పేయి రాజకీయ జీవితచరిత్ర గురించి దేశంలో తెలియనివారు ఉండరని అన్నారు. అనంతరం బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతిగ్రామంలో రేషన్‌దుకాణాల వద్దకువెళ్లి బిజెపి నాయకులు కేంద్రం ఇస్తున్న సన్నబియ్యం గురించి ప్రజలకు అర్థమయ్యేవిధంగా కేంద్రం వాటాపై ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌లో ముఖ్య అతిథులతోకలిసి అటల్‌బిహారి వాజ్‌పేయి ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, సత్యనారాయణ, నాయిని ప్రసాద్, మధు, రంజిత్‌రెడ్డి, కాశీనాథ్, సుభాష్‌చంద్రబోస్‌గౌడ్, సత్యపాల్‌రెడ్డి, జిఎల్ఆర్, శ్రీనివాస్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బియ్యం పంపిణీ సక్రమంగా జరగాలి
**-జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి**



బియ్యం పంపిణీ చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

**కొండపాక, ఏప్రిల్ 3,ప్రభాతవార్త:**
జిల్లాలో రేషన్‌కార్డుకలిగిన అందరికీ సన్నబియ్యం పంపిణీ సక్రమంగా చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి ఆదేశించారు. మండల పరిధిలోని బందారం గ్రామంలో గురువారం జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి తనూజతో కలిసి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈపాస్ మెషిన్‌లో అప్లోడ్ చేశాకే బియ్యంపంపిణీ చేయాలన్నారు. పంపిణీవ్యవస్థలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా అధికారులు విధిగా చూసుకోవాలన్నారు. రేషన్‌కార్డు కలిగిన ప్రతిలబ్దిదారుడు ఒక్కొక్కరికి 6కిలోల చొప్పున సన్నబియ్యం తీసుకోవాలన్నారు. జిల్లాలో 2,91, 327 రేషన్‌కార్డులుండగా 9,05,555 రేషన్‌కార్డు దారులు ఇట్టిపథకం కింది లబ్దిపొందుతున్నారని తెలిపారు. ప్రతిరేషన్‌దుకాణంలో డీలర్లు తప్పని సరిగా రిజిష్టర్‌లు ఉంచాలని వివరించారు. కార్య క్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తనూజ, తహసీల్దార్ సలీంనాయక్, సహాయ పౌరసరఫరాల అధికారి సాయి, రవి, ఉప తహశీల్దార్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దలు తినే బియ్యం..పేదలకు పంపిణీ
**-రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**



సన్నబియ్యం అందచేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

**జోగిపేట ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
శ్రీమంతులు తినేబియ్యాన్ని నిరుపేదలకు అందచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వానిదని రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. గురువారం జోగిపేట వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఆవరణలో సన్నబియ్యంపంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో పేదలకు అందచేసే బియ్యం అంతనాణ్యమైనవి కాకపోవటంతో పెద్ద ఎత్తున పక్కదారి పట్టాయని, దీన్ని దృష్టిలో ఉంచుకునే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాణ్యమైన సన్నబియ్యం పథకాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ఈపథకం ద్వారా రెండు రకాల ప్రయోజనాలు చేకూరుతున్నాయని, ఒకటి లబ్దిదారులకు సన్నబియ్య అందటంతోపాటు సన్నబియ్యంపండిస్తున్న రైతులకు క్వింటాలుకు ఐదువందలు అదనంగా బోనస్ అందచేయటం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 2.85కోట్లమందికి లబ్ది చేకూరుతుందన్నారు. జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియ్యంపంపిణీ కార్యక్రమం విజయవంతం కోసం అధికారులు, డీలర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో 846చౌకధరల దుకాణాల ద్వారా సుమారు 12లక్షలమందికిపైగా లబ్దిచేకూరుతుందని తెలిపారు. పౌష్టికాహారం ఉండేవిధంగా అవసరమైన పోషకాలు కలిపి వీటిని అందచేస్తున్నట్లు ఆమెతెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపుకలెక్టర్ మాధురి, డిఎస్‌వో శ్రీనివాస్ రెడ్డి, డిఎం అంబదాస్ రాజేశ్వర్, ఆర్డీవో పాండు, తహసీల్దారు విష్ణుసాగర్, డిప్యూటి తహసీల్దారు మధుకర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్‌ప్రభుత్వం విఫలం
**-నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**



సిసిరోడ్డుపనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**వెల్దుర్తి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన మాసాయిపేటలో మసీదు వద్ద సిసిరోడ్డు పనులకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆమెమాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం ఎన్నికలహామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికలకుముందు ఎన్నోహామీలను ప్రజలకు ఇచ్చిందని, ఇప్పుడు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఏ ఒక్క గ్రామంలో పూర్తిగా రైతులు రుణమాఫీ కాలేదని ఆమె సవాల్ విసిరారు. మహిళలకు రూ.2500 ఇవ్వడంలేదని, కళ్యాణ లక్ష్మికితోడు బంగారం ఊసేలేదన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధిపనులు అడ్డుకోవడం ప్రభుత్వానికి తగదన్నారు.ఇప్పటివరకు కొన్నిపనులుకావాల్సి ఉండగా మంత్రులు వస్తారని పనులను ఆపుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు కరెంటు కోసం సబ్ స్టేషన్ మంజూరు కాగా వాటిని అమలు పరచడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం పార్టీలు పాటుపడాలని, అలాంటిది అభివృద్ధిని అడ్డుకోవడం సరైనపద్ధతి కాదని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. ఈకార్యక్రమంలో పంచాయతీరాజ్‌శాఖ అధికారి రాధిక, మాసాయిపేట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు స్టేషన్ శ్రీనివాస్, మాజీసర్పంచి నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మకం
**-మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు**



సన్నబియ్యం పంపిణీలో జిల్లా కలెక్టర్ రాహెల్‌రాజ్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం చారిత్రాత్మకం అని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. గురువారం చిన్నశంకరంపేట పట్టణంలోని చౌక ధరల దుకాణంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పేదలు, ధనికులు అనేతేడా లేకుండా అందరూ ఒక్కటేనని భావంతో రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేయడం ప్రజాపాలన ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. గతంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇస్తున్న అన్ని సరుకుల పంపిణీని బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఎత్తివేసి దొడ్డుబియ్యం మాత్రమే పంపిణీ చేసి పేదల పట్ల పక్షపాత వైఖరి ధోరణి అవలంబించిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో అర్హులైన పేద ప్రజలందరికి రేషన్ కార్డులలతోపాటు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని తెలిపారు. ఏడుపాయల అమ్మవారి దేవాలయం, మెదక్ చర్చి, చిన్నశంకరంపేట మండలం అభివృద్ధి పథంలో ముందు వరుసలో ఉంటాయన్నారు. 25ఎకరాలలో 200కోట్ల రూపాయల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు మంజూరు చేసుకున్నామన్నారు. చిన్నశంకరంపేట మండలంలో 25 రేషన్‌షాపులకు గాను 11,411 రేషన్‌కార్డుదారులకు 38,662 కుటుంబ సభ్యులకు సన్నబియ్యం పంపిణీ చేయడం జరిగిందన్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ పథకాన్ని పకడ్బందీగా అమలు అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం జై బాపూ, జై సంవిధాన్ అనే గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి సురేష్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు సాన సత్యనారాయణ, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి మాజీ ఎంపిపి అరుణ, గోపాల్‌రెడ్డి, శంకర్, గణేష్, మోహన్‌నాయక్, రాజ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికి 6కిలోల సన్నబియ్యం
**-ఎమ్మెల్యే రోహిత్‌రావు, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

**పాపన్నపేట, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
పేదోడు తృప్తిగా భోజనంచేసేందుకు అర్హులైన ప్రతి ఒక్కరికి 6కిలోల సన్న బియ్యం పంపిణీచేస్తున్నామని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌లు అన్నారు. గురువారం జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్‌తోకలిసి సన్న బియ్యం పంపిణీ, కళ్యాణలక్ష్మిచెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రోహిత్‌రావు మాట్లాడుతూ దొడ్డుబియ్యం రీసైక్లింగ్‌ను అడ్డుకునేందుకు ప్రతిపేదోడికి సన్నబియ్యం అందచేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలుతీసుకున్నారన్నారు. అన్నివర్గాల ప్రజలు ప్రజాపాలన ప్రభుత్వంతో సంతోషంగా జీవనం సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ రమాదేవి, తహసీల్దార్ సతీష్, జిల్లా కాంగ్రెస్ కిసాన్‌సెల్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, మాజీ జడ్పిటిసి సభ్యులు మల్లప్ప, నాయకులు గౌస్, ఆకుల శ్రీను, వంతుల భూమన్న, నిఠలాక్షప్ప, నరేందర్‌గౌడ్, చోటు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు దొంగల అరెస్టు

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లిన ఘటనలో ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు చిన్నశంకరంపేట ఎస్సై నారాయణగౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం చిన్నశంకరంపేట పట్టణానికి చెందిన భాగయ్య గత ఆదివారం తన ద్విచక్రవాహనాన్ని పొలంవద్ద ఉంచి పొలంపనిలోకి వెళ్ళాడు. వచ్చి చూసేసరికి ద్విచక్రవాహనం కనిపించకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదుచేశాడు. గురువారం ఉదయం చిన్నశంకరంపేట ప్రధానరహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు అనుమానస్పదంగా కనిపించడంతోపాటు ద్విచక్రవాహనంపై పారిపోతుండగా పోలీసులు వారినిపట్టుకుని విచారించగా,వాహనాన్నిదొంగిలించినట్లు అంగీకరించారు. నిందితులిద్దరూ కామారం తండాకుచెందిన భానోతు నరేష్, హలావత్ చందర్లు అని, వారిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నారాయణగౌడ్ తెలిపారు.

## వృద్ధదంపతుల అనుమానాస్పద మృతి

**నంగునూర్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
వృద్ధదంపతులు అనుమానస్పదస్థితిలో మృతిచెందిన సంఘటన నంగునూర్ మండలకేంద్రంలో చోటుచేసుకుంది. రాజగోపాల్‌పేట ఎస్ఐ ఆసీఫ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నంగునూర్‌కు చెందిన మృతుడు ఆవుల కొమురయ్య తండ్రి మల్లయ్య, మృతురాలు ఆవుల బుదవ్వ అనేవృద్ధులు వారి బావివద్దగల పౌల్ట్రీఫాంలో కుమారుడు పర్శరాములుకు దూరంగా గత సంవత్సరంనుండి నివాసం ఉంటున్నారని, అయితే రోజుమాదిరిగానే వారి కుమారుడు పర్శరాములు బుధవారంరాత్రి 8.30నిమిషాలకు తల్లితండ్రులను చూసి వచ్చాడని, తిరిగి గురువారం ఉదయం వెళ్లి, పడుకున్న వారి తల్లిదండ్రులను పిలవగా, వారు పలుకకపోవడంతో పక్కపొలంవద్ద ఉన్నవ్యక్తి సహాయంతో రూం డోర్లు పగలగొట్టి చూసేసరికి ఇద్దరూ చనిపోయి ఉన్నట్లు గుర్తించారని, తల్లిదండ్రులు ఇద్దరూ ఒకేసారి మృతిచెందడంపట్ల తనకు అనుమానం ఉందని వారి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసినట్లు తెలిపారు.

## అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యం
**-సంఘటనీస్థలాన్ని సందర్శించిన తూప్రాన్ డిఎస్పీ వెంకట్‌రెడ్డి**



సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న తూప్రాన్ డిఎస్పీ వెంకట్‌రెడ్డి తదితరులు

**నర్సాపూర్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
గతనెల అదృశ్యమైన మహిళ శవంగా ప్రత్యక్షమైన సంఘటన నర్సాపూర్ మెదక్ ప్రధానరహదారిలోని సద్గురు రెస్టారెంట్‌సమీపంలో చోటు చేసుకుంది. ఈమేరకు సంఘటన స్థలాన్ని తూప్రాన్ డిఎస్పీ వెంకట్‌రెడ్డి సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘటన వివరాలు ఎస్సై బి.లింగంకథనం ప్రకారం ఇలా ఉన్నాయి, నర్సాపూర్ మండలంలోని ఎల్లారెడ్డిగూడా తండా గ్రామపంచాయతీపరిధిలోని జయరామ్‌తండాకుచెందిన మెగావత్ బుజ్జి(52)గత మార్చినెల 25న తమ ఇంటినుండి బయలుదేరి నర్సాపూర్ ఆసుపత్రికి అని చెప్పి వెళ్ళిందన్నారు. రాత్రివరకు ఇంటికి రాకపోయేసరికి మెగావత్ బుజ్జి కుమారుడు మెగావత్ కుమార్ పలుమార్లు ఫోన్‌చేసినా స్విచ్ ఆఫ్ వచ్చిందని అన్నారు. కుమారుడు చుట్టుపక్కల, తెలిసినవారివద్దవెదికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు అన్నారు. దీంతో నర్సాపూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుచేయగా ఎస్సై బి.లింగం కేసునమోదు చేసుకున్నారు. అప్పటినుండి ఈకేసుపై దర్యాప్తు చేస్తుండగా గురువారం నర్సాపూర్-మెదక్ ప్రధానరహదారి సద్గురు రెస్టారెంట్ సమీపంలో కాలువలో శవమై కనిపించినట్లు తెలిపారు. పోలీసుబలగాలు క్లూస్ టీమ్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించి కుటుంబసభ్యులు, తండావాసులను పిలిపించి ఆనవాళ్లు చూపించగా అదృశ్యమైన మెగావత్ బుజ్జి మృతదేహమే అని చీరను, ఇతర ఆనవాళ్లనుబట్టి గుర్తించారు. ఈశవం కుళ్ళిపోయి ఎముకలే మిగిలాయి. దీంతో పోలీసులు క్లూస్ టీముల ఆధ్వర్యంలో నిర్ధారణ చేశారు. సంఘటన స్థలాన్ని తూప్రాన్ డిఎస్పి వెంకట్‌రెడ్డి సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడే పోస్ట్‌మార్టంనిర్వహించి, బుజ్జిశవాన్ని బంధువులకు అప్పగించారు. అదృశ్యమైన మహిళ బుజ్జిశవం లభించడంతో తల్లి ఇంటి వాళ్ళు ఎల్లారెడ్డిగూడెం తండా ఇరువర్గాలకు తోపులాటలు జరిగాయి. ఈ క్రమంలో ఎల్లారెడ్డిగూడెంతండా మాజీసర్పంచ్ సంతోష్, భర్త బిక్కునాయక్‌పై కొందరు దాడిచేశారు. ఈదాడిలో బిక్కునాయక్‌కు చాలా దెబ్బలు తగిలాయి. ఈ మేరకు మెరుగైనచికిత్సనిమిత్తం మాజీసర్పంచ్ సంతోష్, భర్త బిక్కునాయక్‌ను హైదరాబాద్ సూరారంలోని ఆసుపత్రికి తరలించారు.

## రోడ్డుప్రమాదంలో వ్యక్తిమృతి-ఇద్దరికి గాయాలు

**మునిపల్లి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రగాయాలకు గురైన సంఘటన మండల పరిధిలోని బుదేరా చౌరస్తాలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేష్‌నాయక్ కథనంప్రకారం, ఇందుకు సంబంధించిన పూర్తివివరాలు ఇలా ఉన్నాయి. మండలపరిధిలోని బుదేరాకుచెందిన వనంపల్లి రమేష్(47) గురువారం సాయంత్రం బుదేరాచౌరస్తాలో ఓహోటల్‌లో టీసేవించేందుకు వెళుతున్న క్రమంలో సదాశివపేట నుంచి జహీరాబాద్ వైపు వెళుతున్న క్వాలిస్ వాహనం అతివేగంగా వచ్చి రమేష్‌ను ఢీకొంది. ప్రమాదంలో రమేష్ అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రగాయాలకు గురయ్యారన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం, క్షతగాత్రులను చికిత్సనిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికితరలించి కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై రాజేష్‌నాయక్ వివరించారు.

## మహనీయుల ఉత్సవాలకు ఆహ్వానం



**అత్తాపూర్ ఏప్రిల్ 3 ,ప్రభాతవార్త :**
మహనీయుల జయంతి ఉత్సవాలకు ఎప్పుడు ఎల్లవేళ్లల తన వంతు బాధ్యతగా సహాయ సహకారలు అందిస్తున్న బుద్వేల్ గ్రామ మాజీ కౌన్సిలర్ శ్రీ కోరని దయానంద్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సామ ఇంద్రపాల్ రెడ్డి పేర్కొన్నారు.గురువారం వారిని రాజేంద్రనగర్ సర్కిల్ జై భీమ్ జై రామ్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి డా"బాబు జాగ్జీవన్ రామ్ మరియు డా"బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు ఎడ్లకాడి సూర్యం, ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్, కోశాధికారి మంగాలారం శ్రీనివాస్, మహనీయుల జయంతి ఉత్సవాల వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ పోయిల జీవన్ దాస్ గారు,ఎమ్.ఆర్.పి.ఎస్ జాతీయ నాయకులు వనం నర్సింహా మాదిగ,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కన్వీనర్ శ్రీ మాద్దిలేటి మాదిగ,గడ్డం సామెల్, మాజీ అధ్యక్షులు గోల్కొండ రాజ్ కుమార్,పంబాల రాజు, ఎడ్లకాడి చంద్ర శేఖర్,బర్ల సుమన్,కవ్వగూడెం గౌతమ్ బండారి సుదర్శన్, కోడూరి రాజు,తదితరులు ఉన్నారు.

## 5న రవిస్ బ్రిలియంట్‌లో స్పెస్ ఎక్స్ పో

**అత్తాపూర్ ఏప్రిల్ 3 ,ప్రభాతవార్త :**
భారత అంతరిక్ష పరిశోధ సంస్థ నేతృత్వంలోని జాతీయ రిమోట్ సెన్సింగ్ సెంటర్ మరియు కెవి ల్యాబ్ సహకారంతో కాటెదాన్ శాంతినగర్ లోని రవిస్ బ్రిలియంట్ స్కూల్ ఆవరణలో ఈనెల 5వ తేదీన ఖిస్పెస్ ఎక్స్ పోఖి నిర్వహిస్తున్న ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎస్.ఆర్. రజినీకాంత్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగే ఈ ఎక్స్ పో లో విద్యార్థులకు పరిశోధనల నమూనాల తయారీకి కావలసిన అద్భుతమైన అనుభవం లభించనుందన్నారు. విద్యార్థుల్లో సామాజిక మరియు ఆర్థిక సమస్యల పరిష్కారాలను చూపే ఆలోచనల దిశగా ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్, అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి కె. శంకర్ రాథోడ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేంట్ పాఠశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి తదితరులు హాజరవుతారని రజినీకాంత్ తెలిపారు.

## ప్రిన్సిపాల్ గోవర్ధన్‌కు శుభాకాంక్షలు వెల్లువ

**అత్తాపూర్ ఏప్రిల్ 3 ,ప్రభాతవార్త :**
రాజేంద్రనగర్ అగ్రికల్చరల్ కాలేజ్ ప్రిన్సిపాల్ (అసోసియేషన్ డీన్ )గా డాక్టర్ గోవర్ధన్ పదవీ బాధ్యతలు చేపట్టిన సదర్భంగా రాజేంద్రనగర్ అంబేద్కర్ నగర్ బస్తీ వాసులు మర్యాదపూర్వంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పత్యార నర్సింహా.పత్తి రాజు. గొడుగు సంజీవ. దాసరి రమేష్ . పంబల రాజు.పెరుమల రవీందర్.అరుణ్.పెరుమల శివ.

## కొమురయ్యకు ఘన నివాళి



**అత్తాపూర్ ఏప్రిల్ 3 ,ప్రభాతవార్త :**
అత్తాపూర్ డివిజన్‌లోని హైదరగూడ చౌరస్తాలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 98వ జయంతి కార్యక్రమాన్ని అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సిలిగే వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చివర్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ ఎం కొమురయ్య విచ్చేసి నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ.... దొడ్డి కొమురయ్య నైజాం తో పోరాటం సాగిస్తూ తెలంగాణ సమాజాన్ని సంఘటితం చేస్తూ అమరుడయ్యాడని తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కావడం సుధాకర్ విజయ్ కుమార్ ప్రజాభక్త సమాజం అధ్యక్షులు నరసింహ జయానంద రెడ్డి నల్లింగ్ రమేష్ కిరణ్ చారి కిట్టు రాజు పైల్వాన్ రావుల జగన్ వెంకట్ రెడ్డి విశాల్ శర్మ బాలకృష్ణ శశికాంత్ శర్మ విజయ స్వామి ముఖేష్ అనురాధ సతీష్ శ్రీను శ్రీశైలం శివ రాము కే ప్రసాద్ బీట్కూరి శ్రీనివాస్ కాడెం నర్సింగ్ రావు నల్లింగ్ రాజు ఆనంద్ రాంబాబు ధనంజయ మహేందర్ పాల్గొన్నారు

## 6న సదస్సును విజయవంతం చేయండి

**సైఫాబాద్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై కాల్పులు జరిపి 28 సంవత్సరాలు గడిచిన నేపథ్యంలో ఈ నెల 6వ తేదీన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ప్రశ్నించే గొంతులు-పాలకుల అణిచివేత' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామని గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి జి.వి.సూర్యకిరణ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట ఈ సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నిరంతరం ప్రజల కోసం, హక్కుల కోసం ఉద్యమించిన నాయకుడు గద్దర్ అని, 6వ తేదీన జరిగే సదస్సును విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఆస శ్రీరా ములు, దళిత సంఘాల నాయకులు గుడిమల్ల వినోద్, కరణం కిషన్, గడ్డం శ్రీనివాస్, దాసరి విశాల్, కాడారం వినయ్‌కుమార్, మోహన్,మారుతి తదితరులు పాల్గొన్నారు.

## చెరువు వద్ద మొక్కలు నాటిన విద్యార్థులు

**అల్వాల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** అల్వాల్ చెరువు వద్ద గురువారం సన్‌ఫ్లవర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు మొక్కలు నాటారు. చెరువులు పరిరక్షణలో బాగంగా విద్యార్థులలో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాన్ని చేపట్టామని పాఠశాల ప్రిన్సిపల్ సంగీత రఘురామ్ తెలిపారు. విద్యార్థులకు ఉపాధ్యాయులుతో పాటుగా జెసి నేత సురేందర్ రెడ్డి సహకరించడం జరిగింది. కుంటలు, చెరువులు కాపాడుకున్నాడు భూగర్భ జలాలు పరిరక్షించబడతాయని విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించడం జరిగింది.

## రెండు అవార్డులు సాధించిన నార్సింగి కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

**నార్సింగి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** ఈ ఆర్థిక సంవత్సరం నార్సింగి మున్సిపల్ పరిధిలో అత్యధికంగా ఆస్తిపన్ను వసూలు చేసినందుకు గాను సిడిఎంఏ టి.కే.శ్రీదేవి రెండు అవార్డులను కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ నార్సింగి మున్సిపల్ సిబ్బంది సమిష్టిగా కష్టపడడం వల్లనే ఈ సంవత్సరం అత్యధికంగా ఆస్తి పన్ను వసూలు చేశామని వివరించారు. గత మూడేళ్ల కాలంలో ప్రభుత్వం ఆదేశించిన అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయడం వలన నార్సింగి మున్సిపల్‌కు మంచి పేరు, గుర్తింపు లభించిందన్నారు. ఉన్నతాధికారులు నార్సింగి మున్సిపల్ సాధించిన విజయాలను గుర్తించి రెండు అవార్డులను అందించి, అభినందించారని వివరించారు. ఈ అవార్డులు సిబ్బంది అంకిత భావంతో పని చేయడం వల్లనే వచ్చాయని తెలిపారు.

## శాంతినగర్‌లో నీటి సమస్యను తీర్చాలని మహిళల వినతి

**నార్సింగి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ హైదర్షాకోట్‌లోని శాంతి నగర్ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మహిళలు మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి వెంటనే శాంతి నగర్ కాలనీ ప్రజల సమస్యను జల మండలి జిఎం, మేనేజర్లకు ఫోన్‌చేసి తెలిపారు. వీలైనంత త్వరగా నీటి ఇబ్బందులు తీర్చాలని, రెండు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేయాలని కోరారు. ప్రజల ఇళ్లల్లోని బోర్లు ఎండిపోయాయని, జల మండలి నుంచి రావాల్సిన నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొందరు వాటర్ ట్యాంకర్లు తెచ్చుకొని కాలం వెల్లదీస్తుంటే, పేదలు మాత్రం ట్యాంకర్లు కొనలేక, వాడుకునే నీరు లేక అల్లాడిపోతున్నారన్నారు. వేసవి కాలంలోనే ప్రజలకు నీటి ఇబ్బందులు వస్తాయని, ఈ సమయంలో ఆదుకోవాల్సిన జల మండలి అధికారులు ముఖం చాటేయడం బాధాకరమైన విషయమన్నారు. వెంటనే జల మండలి అధికారులు స్పందించి ప్రజల నీటి సమస్యను పరిష్కరించాలని, లేదంటే



హైదర్షాకోట్ శాంతి నగర్ కాలనీలో నీటి సమస్యలు పరిష్కరించాలని మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిని కోరుతున్న మహిళలు

ప్రజలందరిని తీసుకు వచ్చి జల మండలి కార్యాలయంను ముట్టడిస్తామని బిజెఎంసి మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు. రాజేందర్‌రెడ్డి స్పందన పట్ల శాంతి నగర్ కాలనీ మహిళలు సంతోషంను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హైదర్షాకోట్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింగ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

## త్యాగరాయ గానసభ అభివృద్ధికి కళా కుటుంబం అంకితం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** త్యాగరాయ గాన సభ అభివృధి లో కళా కుటుంబం అంకిత మైనారు అని శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి కొనియాడారు. గురువారం రాత్రి శ్రీ త్యాగరాయ గానసభలోని కళా దీక్షితులు కళా వేదిక పై గాన సభ పూర్వ అధ్యక్షుడు కళా దీక్షితులు జయంతి గాన సభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి కళా దీక్షితులు స్మారక పురస్కారాలు సాంస్కృతిక రంగ ప్రముఖులు సతీష్ బాబు చౌదరికిసి హెచ్ వి ప్రసాద్‌కు బహుకరించి మాట్లాడారు కళా సుబ్బారావు తనయుడుగా దీక్షితులు గాన అధ్యక్షునిగా ఆడిటోరియంను సుందరంగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టారు అని అయన సోదరునిగా జనార్ధన మూర్తి అధ్యక్ష స్థానంలో కొనసాగిస్తున్నారు అని అభినం దించారు జంట నగరాలలోనే కాక రెండు తెలుగు రాష్ట్రాలు విదేశీ ఆంధ్రులు కూడా గాన సభ వైభవాన్ని గుర్తించారు అని వివరించారు అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ తన సోదరుడు దీక్షితులు అర్థాంతరంగా జీవితాన్ని ముగించటం వల్ల తాను ఏకగ్రీవంగా అధ్యక్షునిగా ఎంపిక ఇనానని తండ్రి సోదరుడు వేసి న



సాంస్కృతిక రంగ ప్రముఖులు సతీష్ బాబు చౌదరి కి సి హెచ్ వి ప్రసాద్‌లను సత్కరించిన దృశ్యం

బాటలో గానసభ అభివృధికి కృషి చేస్తున్నాను అని చెప్పారు పురస్కార గ్రహీతలు సతీష్ ప్రసాద్‌లు దీక్షితులు కు అత్యంత అభిమానులు అని వివరించారు పురస్కార గ్రహీతలు సతీష్ ప్రసాద్‌లు మాటడుతూ దీక్షితులుతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు వేదికపై గానసభ సంయుక్త కార్యదర్శి చక్రపాణి పాలక వర్గ సభ్యురాలు గీత దేవి పాల్గొన్నారు తొలుత జొన్నలగడ్డ జగన్ మోహన్ రావు నిర్వహణలో అయన కృష్ణునిగా నటించిన కృష్ణ రాయబారంలోని శయన దృశ్యం ప్రదర్శించారు.

## కార్మికుల ప్రాథమిక హక్కులను హరించేలా కొత్త కార్మిక చట్టాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**
నిరంకుశ భారత ప్రధానికి నరేంద్ర మోదీ తీసుకువచ్చిన కొత్త కార్మిక చట్టాలు కార్మికుల ప్రాథమిక హక్కులను హరించేవని ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ జి. సంజీవరెడ్డి తెలిపారు. ఈ కొత్త కార్మిక చట్టాలలో మార్పులు కార్మిక సంఘాల ఉద్యమంపై కొత్త ఒత్తిళ్లను తెస్తున్నాయని, బలమైన పోరాటాలతో ఈ ఒత్తిళ్లను ఎదుర్కోవాలని అన్నారు.గురువారం బర్కత్‌పుర, జి.సంజీవ రెడ్డి నివాసంలో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ఐఎన్‌టియుసి ముఖ్య నాయకుల సమావేశం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో తూర్పు గోదావరి ఐఎన్‌టియుసి జిల్లా నూతన అధ్యక్షులుగా వాసంశెట్టి గంగాధర్‌ను నియమించి, నియామక పత్రాన్ని జి. సంజీవ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ నూతన కార్మిక చట్టాలు ఐఎల్‌ఓ యొక్క అంతర్జాతీయ కార్మిక ప్రమాణాలను స్పష్టంగా ఉల్లంఘించాయని పేర్కొన్నారు. కార్మికులకు మెరుగైన ఉపాధి, నిజమైన వేతనాలు, సామాజిక భద్రతా ప్రయోజనాలను కల్పించడంలో యూనియన్లు గణనీయమైన పాత్ర పోషిస్తాయని, కార్మికుల హక్కులను కాపాడేది, వారి శ్రేయస్సును కోరేది దేశవ్యాప్తంగా ఐ.ఎన్.టి.యు.సి ఒకటేనని, దీనిని మరింత బలోపితానికి కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. జోల్లా తారక రామ రావు అనే వ్యక్తి తూ



ఐఎన్‌టియుసి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులుగా వాసంశెట్టి గంగాధర్‌కు నియామక పత్రం అందజేస్తున్న జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపీ జి. సంజీవరెడ్డి

ర్పు గోదావరి ఐ.ఎన్.టి.యు.సి జిల్లా అధ్యక్షులుగా నియమితులయ్యానని నకిలీ నియామక పత్రాన్ని సృష్టించి సంఘ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాడని తమ దృష్టికి వచ్చిందని, జోల్లా తారక రామ రావు అనే వ్యక్తికి ఐ.ఎన్.టి.యు.సికి సంబంధం లేదని, కార్మికులు ఎవ్వరు అతనిని నమ్మొద్దని, అతనిపై న్యాయ పరమైన చెర్యలు తీసుకుంటామని జి. సంజీవ రెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐఎన్‌టియుసి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి వై. నాగన్నగౌడ్, నేతలు పాల్, కె.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## భర్త ఆచూకి కోసం పోలీసులకు భార్య ఫిర్యాదు

**బేగంపేట ఏప్రిల్ 3,ప్రభాతవార్త**
రాంగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్యవైశ్య సంఘంలో స్వీపర్ గా పనిచేస్తున్న ఉసికెల రాజన్న నిజామాబాద్ నుంచి ఇటీవల నగరానికి వచ్చాడు.ఆర్యవైశ్య సంఘం నుంచి తప్పిపోయాడని,తన భర్త ఆచూకి తెలియజేయాలంటూ ఉసికెల రాజన్న భార్య పుష్ప రాంగోపాల్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో ఫిర్యాదు చేసింది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.నిజామాబాద్ కు చెందిన ఉసికెల రాజన్న (44) ఉపాధికోసం తన కుటుంబంతో నగరానికి వచ్చాడు.2024ఫిబ్రవరి నుంచి 2025ఫిబ్రవరి వరకు ఆర్యవైశ్య సంఘంలో స్వీపరగా పనిచేపాడు.అతని ఆర్థిక పరిస్థితులు సరిలేని కారణంగా ఫిబ్రవరి 2025ఫిబ్రవరి నెలలో ఆర్యవైశ్య సంఘంలో ఉద్యోగాన్ని వదిలి వేసి స్వగ్రామమైన నిజామాబాద్ కు తిరిగి వెళ్లాడు.ఈ సమయంలో కల్లుకు బానిసయ్యాడు.మార్చి 26న మధ్యాహ్నం గం 3లకు భార్య ఉసికల పుష్ప తో కల్సి రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని ఆర్యవైశ్య సంఘం కు ఉగాది బోనస్ కోసం వచ్చాడు. ఆర్యవైశ్య సంఘం భవనం వారు నాలుగు రోజులు ఉండాలని చెప్పడంతో భార్య ఉసికల పుష్ప భర్త ఉసికల రాజన్నను ఆర్యవైశ్య సంఘం వద్ద వదిలి తిరిగి ఇంటికి వెళ్లిపోయింది.ఆ తరువాతి రోజు ఆర్యవైశ్యసంఘం మేనేజర్ పుష్పకు ఫోన్ చేసి నీ భర్త మద్యం తాగి చికాకు తెప్పిస్తున్నాడని,అతను ఆర్యవైశ్య సంఘం నుంచి వెళ్లిపోయాడని పుష్పకు చెప్పింది.మరుసటి రోజు ఆర్యవైశ్య సంఘం భవనానికి చేరుకున్న పుష్ప తన భర్త అక్కడ లేకపోవడంతో సమీపంలోని ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో తన భర్త రాజన్న కన్పించడం లేదని,అతని ఆచూకి తెల్పుకోవాలంటూ రాంగోపాల్‌పేట పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసిందన్నారు.ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాంగోపాల్‌పేట పోలీసులు తెలియజేసారు.రాజన్న వయసు 44 సంవత్సరాలు ఎత్తు 5అడుగులు 5అంగుళాలు,నలుపు రంగు ,నల్లచొక్కా, బూడిద రంగు ఫ్యాంటు వేసుకుని ఉన్నాడన్నారు.తెలుగు భాష మాట్లాడుతాడన్నారు.ఇతని ఆచూకి తెల్సిన వారు డయల్ 100కు గానీ రాంగోపాల్‌పేట పోలీసుస్టేషన్ లో గానీ సమాచారం ఇవ్వాలన్నారు.

## పర్యావరణ రక్షణకు ఈవీ వాహనాలు దోహదం -ఐటీ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్

**హైదరాబాద్,ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
పర్యావరణ పరిరక్షణ, కాలుష్యం తగ్గించేందుకు ఎలక్ట్రికల్ వాహనాలు దోహదం చేస్తామని ప్రభుత్వ ఐటీ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. గతంతో పోలిస్తే ఇప్పుడు జనాల్లో ఎలక్ట్రికల్ వాహనాలపై అవగాహన వస్తుందని ఇంధన వాహనాలకు స్వస్తి చెప్పి ఈవివైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. గచ్చిబౌలిలోని కపిల్ టవర్స్‌లో గల విజ్జీ ప్రధాన కార్యాలయంలో 200ఈవీ వాహనాలను జయేష్ రంజన్ చేతుల మీదగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీ వాహనాల విప్లవంలో తెలంగాణ ముందు ఉందని, ప్రభుత్వం ఈవీ వాహనాలకు అనేక రాయితీలను ఇస్తుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, ఈవీ విప్లవంలో విజ్జి భాగమైనందుకు జయేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకుడు బి.రవి చందర్ రెడ్డి, సహ వ్యవస్థాపకుడు, సీఎస్‌ఓ కంకణాల అభిషేక్ రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

## సాంస్కృతిక సాహిత్య రంగాలలో కృషి మానసిక తృప్తి

**-ఆంధ్ర ప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు విజయ బాబు**



గుడిబండి వెంకటరెడ్డిని సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** సాంస్కృతిక సాహిత్య రంగాలలో కృషి మానసిక తృప్తి ఇస్తుందనీ ప్రముఖులు పేర్కొన్నారు. గుడిబండి వెంకట రెడ్డి సాంస్కృతిక సంస్థ ద్వారా వందల కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎందరో కళాకారులను, నటీ నటులను ఉన్నతి లోకి తెచ్చారని ప్రముఖులు ప్రశంసించారు. ఎనభై నాలుగు ఏళ్ల వయస్సు లో సాంస్కృతిక సాహిత్య రంగాలలో కృషి వెంకటరెడ్డి తృప్తిగా ఆరోగ్యకరంగా నిలిపిందన్నారు. గురువారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై వంశీ ఆర్ట్స్ థియేటర్స్, జంట నగరంలో సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్ అధినేత గుడిబండి వెంకట రెడ్డి 84 ఏళ్ల జన్మ దిన వేడుక జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్ర ప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు పి.విజయ బాబు తమ అభినందనలు తెలుపుతూ సంస్థల పక్షాన సాంస్కృతిక భీష్ముడు గుడిబండి వెంకటరెడ్డి అని బిరుదు ప్రదానం చేశారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ వెంకట రెడ్డి రాష్ట్ర సచివాలయం లో ఉన్నత అధికారిగా పని చేసిన కాలం నుంచీ సాంస్కృతిక కార్యక్రమాలు సృజనాత్మక శక్తి తో నిరంతరం గా నిర్వహిస్తూ మన్నన పొందారన్నారు. సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు, దూరదర్శన్ విశ్రాంత పూర్వ డైరెక్టర్ డాక్టర్ మధుసూదన రావు యువ కళా వాహిని లంక లక్ష్మీ నారాయణ, అభినందన భవాని, రాగసప్తస్వర రాజ్యలక్ష్మి కళ రఫీ, కిన్నెర రఘురాం, సమైఖ్య భారతి సత్యనారాయణ, సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, వేమరాజు విజయ కుమార్ తదితర సంస్థల నిర్వాహకులు అభినందన తెలిపారు కార్యక్రమం చైర్మన్ శ్రీనివాస్ రామరాజు సమావేశ కర్త వంశీ రామరాజు స్వాగతం పలికారు వి.వి.రాఘవ రెడ్డి సమన్వయం చేశారు తొలుత ప్రముఖ గాయని ఆమని బృందం గానం లక్ష్మీ శ్రీనివాస్ వీణా వాదన హృద్యంగా సాగాయి.

## అవినీతి అక్రమాలను సాక్షాధారాలతో బయట పెడతాం : బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
పది సంవత్సరాల బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలను సాక్షాధారాలతో సహా బయట పెడతామని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ హెచ్చరించారు. హెచ్సీయూ భూమి వివాదంపై బిఆర్ఎస్, బిజెపి విధానాలపై కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హెచ్సీయూ భూముల వివాదాన్ని విద్యార్థులను ముందు పెట్టి రాజకీయాలకు వాడుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. కూకట్పల్లి శాసనసభ్యుడు మాధవరం కృష్ణారావు హెచ్‌సియు భూములపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సీఎం ముఖ్యమంత్రిని విమర్శించడంపై ఆయన ఘాటుగా స్పందించారు. దొంగే దొంగ అన్నట్లు కృష్ణారావు తీరు ఉందన్నారు. గత 10 ఏళ్లలో కూకట్పల్లి నియోజకవర్గంలో చెరువులు కుంటలు శిఖం భూములు చివరకు నాలాలను సైతం వదలకుండా కబ్జా చేసాడని వీటన్నింటి వ్యవహారం బయటకు తీస్తామని ఎమ్మెల్యే తీరును ఎండగడతామని రమేష్ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత ప్రభుత్వానికి చెందిన ప్రతి ఇంచ్ భూమిని కాపాడుకుంటున్నామని హౌసింగ్ బోర్డ్‌కు చెందిన ప్రతి ఖాళీ స్థలానికి ఫెన్సింగ్ వేస్తున్నామన్నారు. యూనివర్సిటీకి చెందిన ఒక అడుగు భూమి కూడా ప్రభుత్వం తీసుకోదని విద్యార్థులు ఆందోళన విరమించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమం పేరుతో 1200 మంది విద్యార్థులను బలిగొన్న చరిత్ర బిఆర్ఎస్‌ది అని ఇప్పుడు కూడా హెచ్సీయూ విద్యార్థులను రాజకీయంగా వాడుకోవాలని చూస్తోందన్నారు. ప్రజా సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి నిరంతరం 16 గంటలు పని





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

చేస్తున్నారని పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించారన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం రాజీవ్ యువ వికాసం, స్కిల్ యూనివర్సిటీ ద్వారా యువతకు శిక్షణ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కేసీఆర్ చెప్పిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల రేషన్ కార్డులు ఇతర సంక్షేమ కార్యక్రమాలు కేవలం నోటిమాటలకే పరిమితమయ్యాయని రమేష్ విమర్శించారు. సన్న బియ్యంతో పాటు మరో 9 నిత్యావసర వస్తువుల కిట్‌ను ప్రజలకు త్వరలోనే అందించనున్నట్లు ఆయన తెలిపారు. బిఆర్ఎస్‌కు ఇక భవిష్యత్తులో పుట్టగతులు ఉండబోవన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల నాగిరెడ్డి, తూము వేణు, లక్ష్మయ్య, దండగుల యాదగిరి, పుష్ప రెడ్డి, గోపిశెట్టి రాఘవేంద్ర, కుక్కల రమేష్, మేకల రమేష్, మధు గౌడ్, ఐజాచ్, శివ చౌదరి, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా



నార్సింగి మున్సిపాలిటీ గేటెడ్ కమ్యూనిటీస్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యుల దృశ్యం.

**నార్సింగి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గేటెడ్ కమ్యూనిటీ రెసిడెంట్స్ సమస్యల పరిష్కారం కోసం అహర్నిషలు కృషి చేస్తానని రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గేటెడ్ కమ్యూనిటీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా పి.చంద్రవేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నీలేష్ దూబే, ప్రధాన కార్యదర్శిగా సురేష్ బండారు, సంయుక్త కార్యదర్శిగా సుమన్ భట్, కోశాధికారిగా ఎ.నర్సిహ్మారెడ్డిలు సభ్యులుగా శ్రీనివాస్‌రెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, విష్ణురెడ్డి, తారక శ్రీనివాస్, రమేష్‌రెడ్డి, అవినాశ్ తదితరులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గేటెడ్ కమ్యూనిటీస్ రెసిడెంట్స్ నాపై ఉంచిన నమ్మకంను మరింత పెంచుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. వీరి సమస్యలన్నింటిని మున్సిపల్ కమీషనర్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని వివరించారు.

### ఆర్.కృష్ణయ్యకు 'మహాత్మా గాంధీ జ్యోతిరావ్ పూలే ఎక్స్‌లెన్సీ అవార్డు-2025 -తెలంగాణ మేధావుల ఫోరం ప్రకటన

**సైఫాబాద్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** బిసి దళపతి, విప్లవ నేత, నిత్య పోరాట యోధుడు. రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు ఈ ఏడాది 'మహాత్మ గాంధీ జ్యోతిరావ్ పూలే ఎక్స్‌లెన్సి అవార్డు-2025'కు ఎంపిక చేశామని తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణముదిరాజ్, ప్రొఫెసర్ మహమ్మద్ అక్తర్‌అలీ తెలిపారు. గురువారం ఫోరం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఒకరికి మాత్రమే ఇచ్చే ఈ అవార్డును ఆర్.కృష్ణయ్యను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు విద్యానగర్‌లోని బిసి భవన్‌లో మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతిని పురస్కరించుకుని ఆర్.కృష్ణయ్యకు ఈఅవార్డును ప్రదానం చేసి, ఘనంగా సత్కరిస్తామన్నారు.

### తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ సమావేశానికి డిప్యూటీ మేయర్‌కు ఆహ్వానం



ప్లీనరీ సమావేశానికి హాజరు కావాలని డిప్యూటీ మేయర్‌కు వినతి

**తార్నాక, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో జరగనున్న తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ సమావేశానికి ప్రతి ఒక్క తెలంగాణ ఉద్యమకారులు ఏకమై సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని సీతాఫల్మండి జిహెచ్‌ఎంసి ఫంక్షన్ హాల్ లో నిర్వహించబోతున్న సమావేశాని హాజరు కావాలని డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ కోసం రూపొందించిన వాల్‌పోస్టర్‌ను డిప్యూటీ మేయర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అదేవిదంగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, తెలంగాణ ఉద్యమకారుల హామీలు 250 గజాల ఇంటి స్థలం, 25000 పింఛన్లను అమలు చేయాలని, అలాగే కమిటీ ఏర్పాటు చేసి ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డు కలగజేయాలని విన్నవించుకున్నారు, ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం తప్పనిసరిగా గుర్తిస్తుందని అలాగే వారి విషయాలను తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలు అయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండు దయానంద్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, పి సురేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ చీమ శ్రీనివాస్, చైర్మన్ ఏ శివకుమార్ నేత, కన్వీనర్, డాక్టర్ సి శ్రీనివాస్, చైర్మన్ ఆర్కే భూపాల్, హైదరాబాద్ వైస్ చైర్మన్, కొండ స్వామి జర్నలిస్ట్, జగన్ యాదవ్ గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్, జానకి రెడ్డి వైస్ ప్రెసిడెంట్, జంపాల లక్ష్మణ్ ముదిరాజ్ గ్రేటర్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్, తోట భాస్కరరావు కో కన్వీనర్, మామ జాంగిర్ జనరల్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహూల్ గాంధీని ఢిల్లీలో కలిసిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్‌ల దృశ్యం

## అత్యంత వైభవంగా వేంకటేశ్వర స్వామి కళ్యాణం



శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణంలో పాల్గొన్న భక్తులు

**చార్మినార్,ఏప్రిల్ 3 ప్రభాతవార్త :**
పాతబస్తీ లాల్‌దర్వాజ పూల్‌బాగ్‌లోని శ్రీ వెంకటేశ్వర మహా దేవస్థానంలో శ్రీ వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం అత్యంత వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణం జరిగింది. గురువారం ఉదయం 7 గంటలకు అగ్ని ముఖం, నిత్య హోమం,శ్రీ మహా లక్ష్మీ హోమం,సాయంత్రం నిత్య పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు జరిగాయి.శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణం జరిగిన అనంతరం దేవస్థానంలో అన్న దాన కార్యక్రమం జరిగింది.కాగా పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో పూల్‌బాగ్ శ్రీ వేంకటేశ్వర మహా దేవ స్థానం చైర్మన్ బాశెట్టి లెనిన్ బాబు,పాలక వర్గ సభ్యులు పి.వేంకటేశ్వరరావు, ఆర్.మురళీధర్,ఎం.అమరేశ్వర్‌రెడ్డి,ఎం.మోహన్‌రెడ్డి,మధుమోహన్,పి.శైలజ,ప్రధాన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్.శ్రీనివాస్,ప్రధాన అర్చకులు కె.మోహనా చార్యులు,తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షులు డాక్టర్.రాజ్‌నారాయణ ముదిరాజ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## గోమాతా-గోవును రాష్ట్ర మాతగా ప్రకటించాలి



మధ్యప్రదేశ్‌లో పాదయాత్ర చేపట్టి సేనా ప్రతినిధులు

**అప్జల్‌గంజ్,ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** మధ్యప్రదేశ్ గోమాతా-గోవును రాష్ట్ర మాతా ప్రకటించాలని కోరుతూ భజరంగ్ సేనా జాతీయ అధ్యక్షులు బజ్జుయాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో తెలంగాణ భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్ లక్ష్మ న్‌రావుగుప్త,భజరంగ్‌సేనా నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ప్రత్యేక చొర తీసుకుని గోవును గోమాతా-రాష్ట్రమాతాగా ప్రకటించాలని కోరారు.ఈమేరకు ర్యాలీన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## దేశాలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న లింగ్విస్టిక్ సెల్ యూత్ చైర్మన్ అశోకేసింగ్ మురళీ మోహన్‌సింగ్

**అప్జల్‌గంజ్,ఏప్రిల్ 3ప్రభాతవార్త:**
శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రజలందరు సుఖసంతోషాలతోఉండాలనేది తెలంగాణ టిపిసిసి లింగ్విస్టిక్ సెల్ యూత్ చైర్మన్ అశోకేసింగ్ మురళీమోహన్‌సింగ్ అన్నారు.చిన్నబజార్‌లోని చారిత్రాత్మకమైన బాలభక్త సమాజ్ ఆధ్వర్యంలో దేవాలయంలో అమ్మవారికి,శివుడు, హన్‌మాన్‌లకుప్రత్యేక పూజలు చేశారు.ఆలయంలో ఉదయం,సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.భక్తులకు ప్రసాదాలను పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య త్వరలో పరిష్కారం

**-బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహా**



మరమ్మత్తు పనులను పర్యవేక్షిస్తున్న బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహా

**ముషీరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
ముషీరాబాద్ డివిజన్ హౌజర్ గల్లీ మరియు సెయింట్ ఫైయస్ స్కూల్ ప్రాంతాలలో గత కొన్ని రోజులుగా నెలకొన్న మంచినీటి సమస్య త్వరలో పరిష్కారం అవుతోందని బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ తెలిపారు. గురువారం హౌజర్ గల్లీలో జరుగుతున్న పైప్‌లైన్ మరమ్మత్తు పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జైసింహ మాట్లాడుతూ మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు నరేష్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డిలు ఎమ్మెల్యే ముఠా గోపాల్ గారికి ఫిర్యాదు చేయటంతో స్పందించిన ఎమ్మెల్యే సమస్యను వెంటనే పరిష్కరించాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మరమ్మత్తు పనులు ప్రారంభించిన వాటర్‌వర్క్స్ అధికారులు త్వరలో సమస్యను పరిష్కరిస్తారని, ఇక స్థానిక ప్రజలకు మంచినీటి ఇబ్బందులు తొలగిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షులు కొండా శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి ఆకుల అరుణ్, దీన్‌దయాళ్‌రెడ్డి, తల్లారి శ్రీకాంత్ ముదిరాజ్, శ్రీనివాస్, సత్యనారాయణ బాబు పాల్గొన్నారు.

# 6న శ్రీరామనవమి శోభాయాత్ర

**-సీతారాంబాగ్ నుండి హనుమాన్ వ్యాయామశాల వరకు యాత్ర**

**-20 వేల మంది పోలీసులతో బందోబస్తు**



ఉత్సవ కమిటీ ప్రతినిధులు, పోలీసు అధికారులతో కలిసి శోభాయాత్ర ప్రధాన ఊరేగింపు మార్గంను పరిశీలిస్తున్న సిపి సి.వి.ఆనంద్

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** శ్రీరామనవమి శోభా యాత్ర సందర్భంగా సీతారామ్‌బాగ్‌లోని ద్రౌపది గార్డెన్‌లో అన్ని శాఖల అధికారులతో గురువారం సమన్వయ సమావేశం జరిగింది. సివి ఆనంద్ మాట్లాడుతూ శ్రీరామ నవమి శోభా యాత్ర 2010 లో ప్రారంభమై అనతి కాలంలోనే దేశ వ్యాప్తంగా ఖ్యాతి పొందిందన్నారు. శ్రీరామనవమి శోభా యాత్ర ౨ కొనసాగుతుందని, శ్రీరామ నవమి శోభా యాత్ర శాంతియుతంగా, సంతోషంగా జరుపుకోవాలి కోరారు. హైదరాబాద్ సిటీ పోలీసు తరపున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రారంభం నుండి ముగింపు వరకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. శోభా యాత్ర శాంతియుతంగా జరిగేందుకు ప్రజలు, ఉత్సవ సమితి నిర్వాహకులు పోలీసు వారితో సహకరించాలన్నారు.శోభా యాత్ర మధ్యాహ్నము 1 గంటల వరకు ప్రారంభించే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, శోభా యాత్ర దారులు చాలా చిన్నగా ఉండటం వలన, పెద్ద టస్కర్ వాహనాలు వెళ్ళడానికి చాలా ఇబ్బందిగా ఉంటుంది, కావున ముందస్తుగా వాహనాలతో ఒక ట్రయల్ రన్ ఏర్పాటు చేసుకోవాలని ఉత్సవ సమితి సభ్యులకు సూచించారు.పోలీసు శాఖ తరపున డ్రోన్ల సహాయముతో బందోబస్తును పర్యవేక్షిస్తుంటామని పేర్కొన్నారు. ఎవరైనా డ్రోన్లు వాడాలన్నా ముందస్తుగా స్థానిక పోలీసు వారి పర్మిషన్ తీసుకోవాలని సూచించారు. డిజె సౌండ్ వాడటము వాలన ప్రజలకు గుండె జబ్బులు, వినికిడి సమస్యలు వస్తున్నట్లు తెలిసింది. కావున అందరి క్షేమము కోరి మీరు డిజెకు బదులుగా సౌండ్ సిస్టమ్ను వాడినచో అందరికి మేలు జరుగుతుందన్నారు. శోభా యాత్రలో ఇతర వర్గాలను కించపరిచే విధంగా పాటలు, స్పీచ్‌లు లేకుండా చూసుకోవాలని నిర్వాహకులను కోరినారు. ఐసిసిసి బిల్డింగ్ నందు జాయింట్ కంట్రోల్ రూమును ఏర్పాటు చేసి శోభా యాత్ర ను పర్యవేక్షిస్తాము. శోభా యాత్రకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా ముగియడానికి అన్ని ప్రభుత్వ విభాగాలు చర్యలు తీసుకోవాలని కోరారు. శోభా యాత్ర మార్గంలో అన్ని ప్రధాన కూడళ్ళ వద్ద, సమస్యాత్మక ప్రాంతాలలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లతో పాటుగా, నిరంతరం సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు. శోభా యాత్ర నిర్వాహకులు విగ్రహాల ప్రతిమల ఎత్తులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.శోభా యాత్రకు 20వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. నేరస్తులపై షీ టీం, సిసిఎస్ పోలీసులతో వారి కదలికలపై పూర్తి స్థాయిలో నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. సమన్వయ సమావేశము అనంతరం సివి ఆనంద్, జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి సభ్యులు ,ఆర్అండ్‌బి , విద్యుత్తు, అగ్నిమాపక, విద్యుత్తు, 108 సర్వీసు, ఆర్.టి.సి, వాటర్ సప్లై, ఆర్‌టిఎ తదితర శాఖల అధికారులు కలిసి 6వ తేదిన జరిగే శ్రీరామ నవమి శోభా యాత్ర ప్రధాన ఊరేగింపు మార్గంను పరిశీలించారు. ఊరేగింపు మంగళ్‌హాట్ నుండి ప్రారంభమై పురానాపూల్ గాంధీ విగ్రహం, జుమేరాత్ బజార్, సిద్ది అంబర్ బజార్, అఫ్జల్ గంజ్, గౌలిగుడ, కోటి ఆంధ్రా బ్యాంకు చౌరస్తా, హనుమాన్ వ్యాయామ శాల గ్రౌండ్‌లో ముగుస్తుంది. ఈ కార్యక్రమానికి అడిషనల్ సిపి విక్రమ్ సింగ్ మాన్, జోయల్ డేవీస్ ఐపిఎస్ జాయింట్ సిపి ట్రాఫిక్, జి.చంద్ర మోహన్ డిసిపి సౌత్ వెస్ట్ జోన్, బి. బాలస్వామి ఐపిఎస్ డిసిపి ఈస్ట్ జోన్,అడిషనల్ కమిషనర్ జిహెచ్ ఎంసి, శ్రీనివాస రావు, డివై.ఆర్.ఎం ఆర్టిసి, భగవంతరావు, భాగ్యనగర్ ఉత్సవ కమిటీ సెక్రటరీ కృష్ణ ఆర్గనైజర్, గోవింద్ రాఠ్కో, జనరల్ సెక్రటరీ, భాగ్యనగర్ ఉత్సవ కమిటీ ఆనంద్ సింగ్ ఆర్గనైజర్‌లు, వెంకన్న, డిఎఫ్ఓ అమరెందర్ రెడ్డి, వాటర్ వర్క్స్, చైతన్యకుమార్ డిసిపి ఎస్.బి, స్నేహ్ మెహ్రా ఐపిఎస్. డిసిపి సౌత్ జోన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు జరిగేలా అవగాహన కల్పించాలి

**- జిల్లా కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి**




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి, డిఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి తదితరులు

**హైదరాబాద్, ఏప్రిల్ 4,ప్రభాతవార్త:** గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు చేసుకునేలా గర్భిణీలను ఆశా, ఏఎన్ఎం, వైద్య సిబ్బంది చైతన్యపర్చాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ప్రోగ్రామ్ అధికారులు, ఎస్‌పిహెచ్ఓలు, వైద్య అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ఆదిశగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలని సూచించారు.ప్రతి పీహెచ్సీల్లో గర్భిణీల రిజిస్ట్రేషన్ సంఖ్య పెరగాలని, ప్రభుత్వ లక్ష్యాలను ఆస్పత్రి వైద్యాధికారులు నిబద్ధతతో బాధ్యతాయుతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీల నమోదు రిజిస్ట్రేషన్, ప్రసవాలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, రాష్ట్రీయ బాల స్వస్తియ కార్యక్రమం, అసంక్రమిత వ్యాధులు, కుష్టు వ్యాధి నివారణ అలాగే క్షయ వ్యాధిపై వైద్య విభాగాల వారీగా సమీక్షించారు. గర్భిణీ స్త్రీల రిజిస్ట్రేషన్‌లో ఆశా, ఏఎన్ ఎంల పాత్ర ప్రముఖంగా ఉండాలని విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో 68 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలో అలాగే 42 శాతం ప్రసవాలు ప్రవేట్ ఆసుపత్రుల్లో జరిగాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో 72 శాతం వరకు పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో బీసీజీ 129, ఓపివి 120 శాతం, హైపర్ టైటిస్ బి 94 శాతం అలాగే పెంటా వాక్సిన్ 129 శాతం చేపట్టడం జరిగిందని అన్నారు. ఈర్యక్రమాల నిర్వహణకు వచ్చే సంవత్సరం కూడా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు మానసిక వ్యాధి నిపుణుల ద్వారా అవగాహన కల్పించి ఆత్మహత్యలు నివారణకు ప్రత్యేక కృషి, గతం కంటే నివారణ చర్యలు తెలిపారు. ఎన్ సి డి ద్వారా దయాబెటిస్, బ్లడ్ ప్రెషర్, క్యాన్సర్, హార్ట్ స్ట్రోక్,బ్రెస్ట్ కాన్సర్, లపై పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కల్పించే దిశగా కార్యచరణ చేపట్టాలని వైద్య అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయమాలిని, చల్లాదేవి డిడిసిఓ డాక్టర్ సరస్వతి, మాస్ మీడియా అధికారి, రాములు, డిప్యూటీ డెమో నరసింహ, జిల్లాలోని అందరూ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

# శివాలయం చుట్టూ మూసీ వరద

**-ఇరుక్కుపోయిన ఇద్దరు వ్యక్తులు**

**-సహాయక చర్యలు చేపట్టిన అధికారులు**

**-కాపాడిన రెస్క్యూ టీం**



దేవాలయం వద్ద ఇరుక్కుపోయిన వీరయ్య, నాగేందర్

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** మూసీనది మధ్యలో ఉన్న శివాలయంలో ఇద్దరు వ్యక్తులు ఇరుక్కుపోయారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చైతన్యపురి డివిజన్ ఫనిగిరి కాలనీ వద్ద ఉన్న పురాతన దేవాలయం మూసీ నది మధ్యలో ఉంది. వేసవి కాలం కావడంతో అక్కడ ప్రవాహం లేదు. దేవాలయం వద్ద గద్దె కట్టడం కోసం వీరయ్య, నాగేందర్ అనే ఇద్దరు వ్యక్తులు గురువారం దేవాలయం పనులు చేయడానికి వెళ్లారు. కాగా గురువారం అకస్మాత్తుగా వర్షం కురవడంతో వీరయ్య, నాగేందర్ గుడి వద్ద ఉండిపోయారు. వర్షం తగ్గుతుందని భావించగా వర్షం తీవ్రం కావడంతో దేవాలయం చుట్టూ వరద నీటి ప్రవాహం పెరిగింది. దీంతో వీరయ్య, నాగేందర్ నది మధ్య ఉన్న దేవాలయం వద్ద ఉండిపోయారు. ఫణిగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం చైర్మన్ కృష్ణారెడ్డి సమాచారం తెలుసుకొని చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగ నరసింహగుప్తా తెలిపారు. కార్పొరేటర్ వెంటనే అధికారులకు సమాచారం అందించారు. దీంతో సరూర్‌నగర్ ఉపకమిషనర్ సుజాత, ఏఈ పార్వతి, డీఈ శ్రీనివాస్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఓ పక్క వర్షం ఎక్కువై వరద నీటి ప్రవాహం పెరుగుతుండడం మరోపక్క చీకటి పడుతుండడంతో సహాయక చర్యలకు సంబంధించి అధికారులు తమ సిబ్బందితో అప్రమత్తమయ్యారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్, జిహెచ్ఎంసి మేయర్ విజయలక్ష్మి, ఫైర్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా హైడ్రాక్ కమిషనర్ రంగనాథ్ వెంటనే రెస్క్యూ టీంను సంఘటన స్థలానికి సహాయక చర్యల నిమిత్తం పంపించారు. రెస్క్యూ టీం గుడి వద్ద ఉన్న వీరయ్య, నాగేందర్‌లను రక్షించడానికి తాడ్ల సహాయంతో గుడి వద్దకు వెళ్లి వారిద్దరిని క్షేమంగా బయటకు తీసుకువచ్చారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వీరయ్య, నాగేందర్‌లను కాపాడడంతో కార్పొరేటర్ రంగ నరసింహగుప్తా వారికి ధన్యవాదాలు తెలిపారు.



వీరయ్య నాగేందర్‌లను బయటకు తీసుకు వస్తున్న రెస్క్యూ టీం బృందం

# వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**- మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ**

**హైదరాబాద్, ఏప్రిల్ 03,ప్రభాతవార్త:** నగరంలో కురుస్తున్న అకాల వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు. నగరంలో గురువారం సాయంత్రం నుండి కురిసిన వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గురువారం సాయంత్రం అధిక వర్షపాతం నేపథ్యంలో మేయర్ జోనల్ కమిషనర్ల తో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులను అప్రమత్తం చేసారు. కూలిన చెట్లను హైడ్రా, డిఆర్ఎఫ్ బృందాలు తొలగిస్తున్నాయన్నారు. శేరిలింగంపల్లి జోన్ లో రైల్వే అండర్ బ్రిడ్జి వలన ట్రాఫిక్ జామ్ ఏర్పడుతున్న నేపథ్యంలో అక్కడ ప్రజలు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జోనల్ అధికారులను ఆదేశించారు. కూకట్ పల్లి జోన్ లో కూడా పలు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని మేయర్ జోనల్ కమిషనర్‌ను ఆదేశించగా వెంటనే సంబంధిత శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు మేయర్ కు వివరించారు. ఎల్ బినగర్ జోన్ లో కూడా పిల్లలు వరదలో చిక్కుకుపోయినట్లు ఫిర్యాదులు వస్తున్నాయని వెంటనే పిల్లలను కాపాడాలని మేయర్ ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసర మైతేనే బయటికి రావాలని, రోడ్డుపై నిలిచిన నీటిలో చిన్న పిల్లలు, వృద్ధులు వెళ్లకూడదని, మ్యాన్ హోల్స్ తెరవ వద్దని మేయర్ ప్రజలను కోరారు. అత్యవసరమైతే జిహెచ్ఎంసి కాల్ సెంటర్ కు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు. ప్రస్తుతం నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించడానికి ఇదే సరైన సమయం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో అక్కడే నీటి సంరక్షణ గుంటలను ఏర్పాటు చేయాలని మేయర్ సూచించారు.

## కొంపల్లిలో హైడ్రా కూల్చివేతలు

**కొంపల్లి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**

మేడ్చల్ కొంపల్లిలో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. గురువారం జయభేరి పార్క్‌లోని సినీ ప్లానెట్ లైన్‌లో కొంపల్లి మున్సిపల్ కమీషనర్ కృష్ణారెడ్డి, రాకేష్ ఆధ్వర్యంలో ఇరువైపులా ఉన్న దుకాణాలు కూల్చివేశారు. రోడ్లు 60ఫీట్లకు విస్తీర్ణం కానున్న నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాదారులకు 15రోజుల క్రితమే నోటీసులు ఇచ్చామని అధికారులు తెలిపారు. దుకాణాదారులకు ఇచ్చిన గడువు పూర్తి అయ్యిందని ఈ నేపథ్యంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తున్నట్లుగా తెలిపారు.

## ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్‌లో మంచి వసూలు సాధించినందుకు అభినందన పత్రం

**కొంపల్లి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**

డా.ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిఐలో గురువారం జరిగిన రివ్యూ మీటింగ్‌లో శానిటేషన్, ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్, ఎల్ఆర్ఎస్ వివిధ అంశాలను రివ్యూ చేయడం జరిగింది. ఈ రివ్యూలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్‌లో మంచి వసూలు సాధించినందుకు గాను కమిషనర్ ఎన్.కృష్ణారెడ్డికి అప్రిసేషన్ సర్టిఫికెట్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఆస్తి పన్నులు సమయానికి చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.





# ఈదురుగాలులతో భారీ వర్షం

**-కూలిన చెట్లు..ఒరిగిన స్తంభాలు -జలమయమైన రహదారులు,ట్రాఫిక్ జామ్**





సెక్రటేరియట్ ముందు చెరువును తలపిస్తున్న రహదారి..

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త** గత కొన్ని రోజులుగా ఉక్కపోతతో ఇబ్బంది పడు తున్న నగరవాసులకు వరుణుడు కనుకరించాడు. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. భారీ ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. నగరంలో సుమారు గంటపాటు వరుణుడు దంచికొట్టాడు. భారీగా కురిసిన వానతో నగరవాసులు తడిసి ముద్దయ్యారు. వర్షానికి వివిధ పనులపై బయటకు వచ్చిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, బషీర్‌బాగ్, నాంపల్లి, లిబర్టీ, హిమాయత్‌నగర్, నారాయణగూడ, లక్డీకాపుల్ ట్యాంక్ బండ్,అమీర్‌పేట్, బోరబండ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పటాన్‌చెరువు, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్,ఎల్బీనగర్, హయత్‌నగర్, తార్నాక, బోడుప్పల్, నాచారం తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. భారీగా కురిసిన వానతో రోడ్లన్నీ కాలువలను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రోడ్ల మీద నీరు నిలిచిపోయింది. దీంతో రోడ్లపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రోడ్లపై వర్షపు నీరుతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా పలు చోట్ల విద్యుత్ నిలిచిపోయింది.సిటీ సివిల్ కోర్టులో, ఖైరతాబాద్‌లోని మెర్క్యురీ హోటల్ వద్ద కార్లపై చెట్లు కూలాయి. ఈ ఘటనలో ఎవ్వరికి ప్రమాదం జరగలేదు.

భారీగా కురిసిన వర్షానికి తెలంగాణ సెక్రటేరియట్ ముందు రహదారులు చెరువును తలిపించాయి. రహదారులపై భారీగా నీరు చేరడంతో అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఛార్మినార్‌లోని ఓ మీనార్‌పై నుంచి కొంత మట్టి కిందపడింది. ఈ ఘటనలో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. రాజ్‌భవన్ రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుండటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. తెలుగుతల్లి ఫ్లైఓవర్ కింద భారీగా నీరు చేరింది. చార్మినార్‌లోని ఓ మీనార్‌పై నుంచి కొంత మట్టి కిందపడింది. ఈ ఘటనలో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. పలుచోట్ల చెట్లు కూలిపోయాయి. స్తంబాలు ఒరిగిపోయాయి. ఖైరతాబాద్‌- పంజాగుట్ట మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

**వాతావరణ శాఖ హెచ్చరికలతో అప్రమత్తమైన హైడ్రా..**

ఈదురు గాలులతో పాటు వర్షానికి నేల కొరిగిన చెట్లను హైడ్రా బృందాలు యుద్ధ ప్రాతిపదికన తొలగించాయి. పలుచోట్ల వరద నీరు నిలిచిపోగా తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.వృక్షాలు పడిన ప్రాంతాలను, నీరు నిలిచిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేరుగా పరిశీలించారు.ఖైరతాబాద్ సోమాజిగూడ ఆర్టీఎ కార్యాలయానికి చేరువలో రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షాన్ని 40 నిమిషాల్లో అక్కడి బృందాలు తొలగించాయి. సైదాబాద్ స్టేట్ బ్యాంక్ కాలనీ, బషీర్‌బాగ్, నెక్లెస్ రోడ్డు, ముషీ రాబాద్, అసెంబ్లీ రోడ్డు, బంజారా హిల్స్ తదితర ప్రాంతాలలో రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షాలను తొలగించాయి.ఓల్డ్ అల్వాల్, ఎల్బీనగర్, బేగంపే ట, మాదాపూర్, మేహిదిపట్నంలోని ఎన్ఎండిసి వద్ద మోకాళ్లకు పైగా నిలిచిపోయిన వరద నీటిని హైడ్రా, డిఆర్ఎఫ్ బృందాలు తొలగించాయి.

# ఎర్లీబర్డ్ టార్గెట్ వెయ్యికోట్లు..




**-ముందుగా ఆస్థిపన్ను చెల్లించేవారికి 5శాతం రాయితీ**

**-గత మూడురోజుల్లో 25కోట్లకుపైగా వసూలు**

**-నెలాఖరువరకు పథకం వినియోగించునే అవకాశం**

**హైదరాబాద్, ఏప్రిల్ 3,ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి )ఎర్లీ బర్డ్ పథకం ద్వారా వెయ్యి కోట్ల రూపాయల పన్ను వసూలు చేయాలని టార్గెట్ పెట్టుకుంది. ఈ పథకం కింద ముందుగా ఆస్తి పన్ను చెల్లించే వారికి 5శాతం రాయితీ ఇస్తుంది. ఏప్రిల్ 1న ప్రారంభమైన ఈపథకం ఈ నెల చివరి వరకు అమలులో ఉంటుంది. ఈ సీం కేవలం 2025-26 ఆర్థిక సంవత్సర ఆస్తి పన్నుకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. గత ఆర్థిక సంవత్సరంలో 830 కోట్ల రూపాయల పన్ను వసూలు కాగా, ఈసారి వెయ్యి కోట్ల రూపాయలు వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో పన్ను వసూలు కోసం డిప్యూటీ కమిషనర్లు, టాక్స్ ఇన్స్పెక్టర్లు. బిల్ కలెక్టర్లు మళ్లీ ఫీల్డ్‌లోకి వెళ్లనున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంకు సంబంధించిన ఆస్తిపన్ను వసూళ్లలో భాగంగా టార్గెట్ రూ.2 వేల కోట్లకు చేరుకునే ప్రయత్నంలో భాగంగా గత మార్చి నెల చివరిరెండు రోజుల్లో కమిషనర్ ఇలంబర్తి ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిల్లో సుమారు రూ.20 కోట్లను వసూలు చేసినట్లు సమాచారం. పశు సంవర్ధక శాఖ, జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ), ఇండియన్ ప్రీవెంటివ్ మెడిసిన్ (ఐపీఎం), 8వ బెటాలియన్ కొండాపూర్ క్యాంపస్, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ కార్యాలయం, నిమ్స్, సెరీకల్చర్, స్టేట్ రూరల్ డెవలప్ మెంట్ విభాగాలకు చెందిన ప్రాపర్టీ ట్యాక్స్ పెండింగ్లో ఉన్న విషయాన్ని ట్యాక్స్ సిబ్బంది కమిషనర్ ఇలంబర్తి దృష్టికి తీసుకెళ్లగా, కమిషనర్ తనదైన శైలిలో ఆయా విభాగాల విభాగాధిపతులతో మాట్లాడి, ట్యాక్స్ జీహెచ్ఎంసీకి చెల్లించేలా వ్యవహరించినట్లు తెలుస్తుంది. ఈరకంగా ఆయా శాఖల నుంచి చివరి రెండు రోజుల్లో జీహెచ్ఎంసీకి రూ.20 కోట్ల ట్యాక్స్ వసూలైంది.

**సిబ్బందిని ప్రశంసించిన కమిషనర్..**

గత ఆర్థిక సంవత్సరంకి సంబంధించి రూ. 2వేల కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ను టార్గెట్‌గా పెట్టుకున్న అధికారులు మధ్యలో సర్వేలు వంటివి చేపట్టడంతో అంతకు ముందుటి ఆర్థిక సంవత్సరం (2023-24) లో వసూలైన రూ. 1.917 కోట్లకు మించి ఒక్క కోటి రూపాయలు ఎక్కువ కలెక్షన్ చేసినాచాలని భావించారు. కానీ ఎవరూ ఊహించని విధంగా గత ఆర్థిక సంవత్సరం ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ రూ.2.038 కోట్లు వసూలు కావటంతో సంతృప్తిచెందిన కమిషనర్ ట్యాక్స్, రెవెన్యూ సిబ్బందికి ప్రోత్సాహకంగా ప్రశంసా పత్రాలను జారీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. పండుగ, సాధారణ సెలవుల ను రద్దు చేయటం తో సెలవుల్లో కూడా ట్యాక్స్ కలెక్షన్ చేసిందుకు ఈరెండు విభాగాలకు చెందిన 800 మంది సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలుస్తుంది.

# దుష్ప్రచారం చేస్తున్నాడని మైనర్ హత్య

**-రాళ్లతో కొట్టి చంపిన దుండగులు**

**-ఇద్దరి నిందితుల అరెస్టు**



**అత్తాపూర్ ఏప్రిల్3,ప్రభాతవార్త :** తమపై దుష్ప్రచారం చేసున్నాడని పగతో ఓ బాలుడిని రాళ్లతో కొట్టి చంపిన దారుణ ఘటన అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.అత్తాపూర్‌లోని గోల్డెన్ సిటీలో మహమ్మద్ రహీం (15)అనే బాలుడిని గుర్తుతెలియని దుండగులు రాళ్లతో కొట్టి చంపి అనంతరం మృతదేహాన్ని మీరాలం చెరువు సమీపంలో పడేశారు. ఉదయం స్థానికులు చూసి సమాచారం ఇవ్వడంతో అత్తాపూర్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో తండ్రి రఫిక్ సంఘట స్థలానికి చేరుకొని కొడుకు మృతదేహాన్ని చూసి విలపించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసును చేధించారు.డిసిపి శ్రీనివాస్ వివరాల ప్రకారం... మృతుడు రహీం తమ పకార్లు సృష్టిస్తున్నాడని పగ పెంచుకున్న నిందితులు అజాద్,నాగేందర్‌లు బుధవారం రాత్రి బాలుడు రహీంను హత్య చేసినట్లు తెలిపారు.నిందితుడు అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్‌గా ఉన్నాడు.మరో నిందితుడు నాగేంద్రపై గతంలో ఎన్‌డిపిఎస్ చట్టం కింది కేసులో నిందితుడు ఉన్నాడు.ఇద్దరిని పట్టుకొని రిమాండ్ తరలించారు.

## వెల్లూర్‌లో సన్నబియ్యం పంపిణీచేసిన చైర్మన్


సన్నబియ్యం పంపిణీచేస్తున్న టిజిఐఐసి చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి

**సదాశివపేట, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని వెల్లూర్‌లో గురువారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని టిజి ఐఐసి చైర్మన్ తూర్పు నిర్మలజగ్గారెడ్డి సిడిసి చైర్మన్ గడీల రాంరెడ్డి, అధ్యక్షులు సిద్దన్న, మార్కెట్‌కమిటీ చైర్మన్ సడకుల కుమార్, వైస్‌చైర్మన్ కంది కృష్ణ, తహసీల్దార్ సరస్వతిలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ వీరేశం, కార్యదర్శి అనిల్‌కుమార్, మార్కెట్‌కమిటీ, ఆత్మకమిటీ డైరెక్టర్‌లు, వెల్లూర్ ప్రభు, నవీన్, సామెల్, డీలర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లిలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు


దొడ్డి కొమురయ్య జయంతిని జరుపుకుంటున్న బిఆర్‌ఎస్ నేతలు

**న్యాల్‌కల్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని మల్లిగ్రామంలోని బిఆర్‌ఎస్‌పార్టీ కార్యాలయంలో గురువారం దొరల దురాగతాలపై తిరగబడిన రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను బిఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించి కొమురయ్యచేసిన త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ జట్గొండ మారుతి కురుమ, మాజీ ఎంపిటిసి సభ్యులు శివానంద శ్రీపతి, కురుమసంఘం నాయకులు మల్లప్ప, సిద్దు, అనిల్, సాయినాథ్, పంచాక్షరి శాలివాన్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాపురంలో సిసి రోడ్డు పనులకు శ్రీకారం


వెంకటాపురంలో సిసి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న దృశ్యం

**సదాశివపేట, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని వెంకటాపురంలో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి సహకారంతో మంజూరైన ఎన్‌ఆర్‌ఈజిఎస్ పథకంలో 11లక్షల 25వేల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణాన్ని టిజి ఐఐసి చైర్మన్ తూర్పు నిర్మలజగ్గారెడ్డి భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయని, పేదలు సంతోషంగా జీవిస్తున్నారని నిర్మలజగ్గారెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో సిడిసి చైర్మన్ గడీల రామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సడాకుల కుమార్, వైస్ చైర్మన్ కృష్ణ, మండ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు సిద్దన్న, మాజీ ఎంపిటిసి సభ్యులు ఒగ్గు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఇమ్రాన్,మాజీ సర్పంచ్‌లు కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్, ఆలయకమిటీ డైరెక్టర్లు శైలేందర్‌రెడ్డి, శివకుమార్, డి.విఠల్, అరుణ్, అశోక్, నరేందర్, ప్రేమానందం, హరికాంత్, అప్పి, హరి రాము, మధు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఆవిర్భావ దినోత్సవాలు విజయవంతం చేయాలి
**-బిజెపి జిల్లా అధ్యక్షులు భైరి శంకర్**


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు శంకర్

**సిద్దిపేట, ఏప్రిల్ 3, ప్రభాతవార్త ప్రతినిధి:**
ఈనెల 6నుండి 12వ తేదీవరకు నిర్వహించనున్న భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాలను విజయవంతంచేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షులు భైరి శంకర్‌ముదిరాజ్ అన్నారు. గురువారం సిద్దిపేటలోని పార్టీజిల్లా కార్యాలయంలో పార్టీజిల్లా పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్రకార్యవర్గ సభ్యురాలు కీర్తిరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిర్వహించబోయే పార్టీ ఆవిర్భావ దినోత్సవాలలో రోజుకో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని సూచించారు. ఈవేడుకల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతంచేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాంచంద్రారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జన్నపురెడ్డిసురేందర్‌రెడ్డి, జనార్ధన్, ఉమారెడ్డి, శివకుమార్, శివ, రామ్‌రెడ్డితోపాటు జిల్లాలలోని అన్నిమండలాల అధ్యక్షులు, కార్యదర్శులతోపాటు తదితరులు ఉన్నారు.

## మండలంలో ఓ మోస్తరు వర్షం

**సిర్గాపూర్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన సిర్గాపూర్‌తోపాటు ఆయాగ్రామాల్లో గురువారం సాయంత్రం ఓమోస్తరు వర్షంకురిసింది. ఎండవేడిమితో ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. నల్లవాగు ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో జోరుగా వానకురిసింది. ఉదయంనుంచి మబ్బులుకమ్ముకుని ఉండటంతో వాతావరణం చల్లనిగాలులు విసురుతూ ఉండగా మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం కురిసింది. చిన్నపాటి వర్షంకురియడంతో ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తంచేశారు. రబీపంటలకు చిన్నపాటి వర్షంతో కొంతమేర ప్రయోజనం కల్గిందని రైతులు ఆనందం వ్యక్తంచేశారు.

## ప్రజాపాలనలో ముందస్తు అరెస్టులు..
**-ఎబివిపి ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్**

**వెల్దుర్తి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడేందుకు పోరాడుతున్న విద్యార్థులను ముందస్తుగా అరెస్టు చేయడం దేనికి సంకేతం అని, ఇది విద్యార్థి హక్కులపై దాడి, ఇది అధికార దుర్వినియోగం అని ఎబివిపి ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ క్యాంపస్‌లో 400ఎకరాలభూమిని ప్రైవేటీకరించడాన్నివ్యతిరేకిస్తూ విద్యార్థులుశాంతియుతంగా నిరసనవ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై లాఠీచార్జ్, భూములను వేలం వేయడాన్ని ఎబివిపి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. యువత ఏకమైతే ప్రభుత్వంపై ప్రతిఘటన తప్పదని ఎబివిపి ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# అకాలవర్షంతో దెబ్బతిన్న పంటలు

**ఈదురుగాలులతో నేలకొరిగిన మొక్కజొన్న, మార్కెట్‌యార్డులో తడిసిన పొద్దుతిరుగుడు ధాన్యం**


నేలకొరిగిన మొక్కజొన్న పంట


మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

**గజ్వేల్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయానికి ఈదురుగాలులతోకూడిన అకాలవర్షం తీవ్రనష్టాన్ని మిగిల్చింది. గురువారం మధ్యాహ్నం గజ్వేల్‌లో ఈదురుగాలులతోకూడినవర్షం సుమారు గంటన్నరపాటు కురిసింది. వర్షంకారణంగా గజ్వేల్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలు వర్షానికి దెబ్బతిన్నాయి. గజ్వేల్ పట్టణంలోని మార్కెట్ యార్డులో గత 20 రోజుల నుండి వివిధమండలాలకు చెందిన రైతులు వందల క్వింటాళ్ల పొద్దుతిరుగుడు ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతుధరలకు విక్రయించడానికి తీసుకువచ్చారు. అధికారులను రైతులుతీసుకువచ్చినధాన్యాన్ని కొనుగోలు చేయాలని పలుమార్లు అడుగగా అధికారులు బార్దాన్ లేదని, లారీలు రావడంలేదని ఏదో ఒక సాకు చూపిస్తూ ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. రైతులకు ప్రతి సంవత్సరం పంటలు చేతికొచ్చే సరికి ఏదో ఒకవిపత్కరపరిస్థితి ఎదుర్కొని పండించిన పంటలను పూర్తిగానష్టపోతున్నారు. అధికారులు 20రోజులనుండి ధాన్యంకొనుగోలు చేయకపోవడంతో గురువారం మధ్యాహ్నం కురిసిన ఈదురుగాలులతోకూడిన వర్షంతో రేకుల షెడ్‌లలో ఉన్న పొద్దుతిరుగుడుధాన్యం పూర్తిగాతడిసి ముద్దయ్యింది. పొద్దుతిరుగుడు ధాన్యం నీటిలోతేలగా ఇదిచూసిన రైతులు ఒక్కసారిగా నివ్వెరపోయారు. ఆరునెలలు కష్టపడి పంటను పండిస్తే చేతికొచ్చే సమయానికి ఇలా అకాలవర్షాలుపడి పంట తమ కళ్లముందే తడిసి ముద్దవుతుంటే మాకు ఆత్మహత్యే శరణ్యమని రైతులు వాపోతున్నారు. ఏప్రభుత్వం అధికారంలో ఉన్నా రైతులకుమాత్రం తిప్పలుతప్పడంలేదు. ఇంకా మూడునాలుగు రోజులు వర్షాలు ఇలాగే ఉన్నాయని వాతావరణశాఖ చెప్తున్నప్పటికీ తడిసినధాన్యానికి అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదని రైతులు రోదిస్తున్నారు. 20రోజుల నుండి ధాన్యం కొనుగోలుచేస్తే ఇంతపరిస్థితి మాకు ఎదురయ్యేదికాదని, అధికారులనిర్లక్ష్యంవల్లే ధాన్యం నీటిపాలు అయ్యిందని రైతులు వాపోయారు. ప్రభుత్వం పొద్దుతిరుగుడు ధాన్యానికి క్వింటాలుకు రూ. 7,300ధర ఇస్తుందని, దళారులను ఎవరినీ నమ్మకుండా ప్రభుత్వానికి ధాన్యం అమ్ముదామని మార్కెట్‌కు తీసుకువస్తే అకాలవర్షాలు మమ్మల్ని ఆగంచేశాయన్నారు. ప్రభుత్వం పంటనష్టపరిహారం ఎకరానికి రూ.3వేలు, రూ.4వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటుందని, ఒకరైతు ఒకపంట పండించాలంటే ఆరునెలలు పని చేయాల్సివస్తుందని, పంట వచ్చేసమయానికి ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైతే ప్రభుత్వం పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఇప్పటికైనా పంట నష్టపరిహారాన్ని చెల్లించే విధంగాచర్యలు చేపడితే బాగుంటుందని పలువురు రైతులు అధికారులను కోరుతున్నారు.

## ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం
**-మాజీ జడ్పిటిసి సర్వాణి సరోజ**


సన్నబియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**టేక్మాల్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని టేక్మాల్‌మండల మాజీ జడ్పిటిసి సర్వాణి సరోజమల్లేశం అన్నారు. గురువారం టేక్మాల్‌మండల పరిధిలోని తంప్లూర్, బొడ్మట్‌పల్లి, సూరంపల్లి గ్రామాలలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాలను నిర్వహించారు. తంప్లూర్‌లో రేషన్‌డీలర్ల సంఘం అధ్యక్షులు స్వరూపరాణి ఎల్లయ్య ఆధ్వర్యంలో సన్నబియ్యంపంపిణీ ప్రారంభించారు. పేదలసంక్షేమంకోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, వైద్య,ఆరోగ్యశాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో ఆందోల్ నియోజకవర్గం ప్రగతిలో దూసుకెళ్తుందని మాజీ జడ్పిటిసి సరోజమల్లేశం అన్నారు. ఈకార్యక్రమంలో టేక్మాల్ మండల మాజీ ఎంపిపి కొట్టి మణెమ్మ నారాయణ, మాజీ సర్పంచ్ కొండ నాగయ్య, మాజీ ఎంపిటిసి కొండ సంధ్యరవిబాబు, డైరెక్టర్ సర్వాణి చిన్నమల్లేశం, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు తుకారాంగౌడ్, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు పఠాన్‌యాదుల్, కాంగ్రెస్ నాయకులు ఖలీల్, రాజాగౌడ్, కొట్టి ప్రవీణ్, శాదుల్, వసీమ్, శ్రీనప్ప, యాదగౌడ్, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై సమీక్షించిన ప్రత్యేక అధికారి


అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న ప్రత్యేక అధికారి రాధాకిషన్

**కొల్చారం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదైన దరఖాస్తుల వివరాలను కులాలవారీగా విభజించి రిజిష్టర్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాధికారి, కొల్చారంమండల ప్రత్యేక అధికారి రాధాకిషన్ అన్నారు. గురువారం కొల్చారం మండలపరిషత్ కార్యాలయన్ని మండల ప్రత్యేక అధికారి రాధాకిషన్ సందర్శించారు. ఎంపిడిఓ రఫిక్ ఉన్నిసా, ఎంపిఓ కృష్ణవేణిలతో సమావేశం అయ్యారు. రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన దంఖాస్తుల వివరాలు, అలాగే ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెవెన్యూ కాంప్లెక్స్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులను మండల ప్రత్యేక అధికారి రాధాకిషన్, రఫిక్ ఉన్నిసా, కృష్ణవేణిలు పరిశీలించారు. పనులను నాణ్యతాప్రమాణాలు పాటించి పూర్తిచేయాలని గుత్తేదార్ రాయపాటి నాగుకు సూచించారు.

## ఏప్రిల్ 9 నుంచి పరీక్షలు-హెచ్‌ఎంలకు ప్రశ్నాపత్రాలు


ప్రధానోపాధ్యాయులకు ప్రశ్నాపత్రాలను అందచేస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

**సిర్గాపూర్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
ఏప్రిల్ 9వ తారీఖు నుంచి 17వ తేదీ వరకు 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు వార్షిక పరీక్షలు కొనసాగుతాయని మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని ఎంఆర్‌సి కార్యాలయంలో ఆయా గ్రామాల్లోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమగ్ర మూల్యాకంనం పరీక్ష ప్రశ్న పత్రాలను ఎంఈఓ అందచేశారు. జిల్లా విద్యాధికారి ఆధ్వర్యంలో డిసిఈబి కేంద్రంద్వార ప్రశ్నపత్రాలు సరఫరా అయినట్లు, ప్రశ్నపత్రాలను హెచ్‌ఎంలకు అందేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యయులు నర్సింగరావు, అర్షద్ అలీ, నింగయ్య, సీఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ చైర్మన్ పదవి మాదిగలకు కేటాయించాలి
**-ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు లాల్‌కుమార్ డిమాండ్**


మాట్లాడుతున్న తడ్కల్ క్లస్టర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు లాల్‌కుమార్

**కంగ్టి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పదవిని మాదిగ సామాజిక వర్గానికే కేటాయించాలని మండల పరిధిలోని తడ్కల్ క్లస్టర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు లాల్‌కుమార్ డిమాండ్‌చేశారు. ఈసందర్భంగా లాల్‌కుమార్ మాట్లాడుతూ ఇంతవరకు మార్కెట్‌కమిటి చైర్మన్ పదవిని ఉన్నతస్థాయి కులాలవారికే కేటాయించారని, మాదిగలను విస్మరిస్తూ వచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. నామినేటెడ్ పోస్టులతో పాటు మార్కెట్‌కమిటి చైర్మన్‌పదవిని మాదిగ సామాజిక వర్గాలకు కేటాయించాలన్నారు. మాదిగలను ఓటు బ్యాంకుగా కాకుండా పదవులు కట్టబెడుతూ మాదిగవర్గం కుడా అన్నిరంగాల్లో అభివృద్ధిచెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాదిగలను విస్మరిస్తే 20వేల డప్పులతో ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. మార్కెట్ కమిటి చైర్మన్‌పదవి మాదిగవర్గానికి కేటాయించకుంటే రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో తమ సత్తా చూపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అంజయ్య, ఎర్రోళ్ల మొగులయ్య, ఎర్రోళ్ల చిన్న సాయిలు, మేత్రి సాయిలు, ఎర్రోళ్ల జైపాల్, ఎర్రోళ్ల డేవిడ్, ఘనపూర్ మేత్రి, సాయిలు, ఎర్రోళ్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌ను అవమానపర్చడం సిగ్గుచేటు

**-గజ్వేల్‌లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర**


3వ వార్డులో మహిళలచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి

**గజ్వేల్, ఏప్రిల్ 3 (ప్రభాతవార్త):**
జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అనే నినాదంతో తెలంగాణ ప్రదేశ్‌కాంగ్రెస్‌కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ పిలుపు మేరకు గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి అధ్యక్షతన గజ్వేల్ మార్కెట్‌కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్‌ల ఆధ్వర్యంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 3,4,15,16 వార్డులలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం తీసుకొని పలు వార్డులలో రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. అంబేద్కర్‌ను నిండు పార్లమెంట్‌లో అమిత్‌షా అవమానపరచడం సిగ్గుచేటన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని, భారత జాతిపిత మహాత్మగాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా పాలనకొనసాగిస్తున్నారన్నారు. కేంద్రప్రభుత్వ వైఖరిని ప్రజల్లోకి తీసుకుపోయి బడుగు, బలహీన వర్గాల హక్కులను కాపాడాల్సిన ఆవశ్యకతను తెలపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఈపాదయాత్రలో పాల్గొనాలని ఈసందర్భంగా పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు... కొనమైన కన్నాయాదవ్, జంగం రమేష్‌గౌడ్, కొల్లూరి సత్యం, ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షుడు శివులు, మైనార్టీనాయకుడు అజ్గర్, ఆంజనేయులు, కృష్ణ, పెర్క యాదగిరి, గుండు లక్ష్మణ్, దయ్యాల యాదగిరి, బద్రి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కొనమైన పావని తదితరులు పాల్గొన్నారు.

## మెటల్‌కుంటలో సన్నబియ్యం పంపిణీ


మెటల్‌కుంటలో సన్నబియ్యం పంపిణీచేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**న్యాల్‌కల్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని మెటల్‌కుంట గ్రామంలో గురువారం కాంగ్రెస్ నాయకులు రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్, మెటల్ కుంట మాజీసర్పంచ్ గుండంగారి తిరుపతిరెడ్డిలు మాట్లాడుతూ శాసన సభ ఎన్నికలసందర్భంగా కాంగ్రెస్‌పార్టీ చేసిన ప్రతిహామీని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అమలుచేస్తూ వస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రేషన్ వినియోగదారులు ఉన్నారు.

## దోసపల్లిలో సన్నబియ్యం పంపిణీ


దోసపల్లిలో సన్నబియ్యం పంపిణీచేస్తున్న దత్తు

**మనూర్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని దోసపల్లిలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని యువజనకాంగ్రెస్‌నాయకులు బిరదార్ దత్తు ప్రారంభించారు. ఈసందర్భంగా దత్తు మాట్లాడుతూ ఎన్నికలసందర్భంగా కాంగ్రెస్‌పార్టీచేసిన ప్రతిహామీని ప్రజాప్రభుత్వం అమలుచేస్తూ వస్తోందన్నారు. కార్యక్రమంలో డీలర్, నాయకులు అశోక్,రాజు,వీరన్న,బాబు,నారాయణ,జయరాజ్, సత్యనారాయణ, ప్రకాష్ పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఆర్‌డిఓ


విద్యార్థులతోకలిసి భోజనంచేస్తున్న ఆర్‌డిఓ అశోక్ చక్రవర్తి

**సిర్గాపూర్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని నల్లవాగు గురుకులపాఠశాల, వసతిగృహాన్ని గురువారం ఆర్‌డిఓ అశోక్ చక్రవర్తి తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల పరిసరాలను, తరగతిగదులను పరిశీలించి విద్యార్థులతోకలిసి సహపంక్తి భోజనంచేశారు. విద్యార్థుల ఆరోగ్యవిషయాలను ఆర్‌డిఓ అడిగి తెలుసుకున్నారు. ఆర్‌డిఓ వెంట తహసీల్దార్ ఉమాశంకర్ ఉన్నారు.

## అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తురెడ్డి

**నారాయణఖేడ్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
విద్యార్థులన్యాయంకోసం పోరాడితే అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, హెచ్‌సియు భూములవేలం నిలిపివేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తురెడ్డి అన్నారు. గురువారం చలో సచివాలయం ముట్టడికి బయలుదేరుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం జరిగింది. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తురెడ్డి మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రజాప్రభుత్వం అని గొప్పలుచెబుతూనే ఒకవైపు విద్యార్థులకు, విద్యారంగానికి తీవ్ర అన్యాయంచేస్తుందన్నారు. హెచ్‌సియు పరిధిలో ఉన్నటువంటి 400ఎకరాల భూములవేలం ఆపేయాలని ఏఐఎస్ఎఫ్, వామపక్ష విద్యార్థిసంఘాల ఆధ్వర్యంలో ఛలో సచివాలయం ముట్టడికి వెళుతున్న సమయంలో నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్లలో విద్యార్థిసంఘాల నాయకులను అరెస్టుచేయడం దారుణం అన్నారు. హెచ్‌సియు భూములవేలం ఆప కుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు బంటి, మహేష్. ఏటీయూసీ జిల్లా నాయకులు చిరంజీవి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు


ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు

**బెజ్జంకి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
బెజ్జంకిమండలానికి వ్యవసాయకళాశాల మంజూరుచేసిన మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లిసత్యనారాయణకు గురువారంమండలంలోని బేగంపేట గ్రామంలో గల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్లకార్డులను ప్రదర్శిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌ఎస్‌యూఐ జిల్లాప్రధానకార్యదర్శి పిట్టల అరుణ్ మాట్లాడుతూ వ్యవసాయరంగాన్ని శాస్త్రీయంగా అభివృద్ధిచేయడానికి మండలానికిమంజూరైన కళాశాల ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెప్ నాయకులు రాంరెడ్డి, రాంజేందర్, సురేష్‌తోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు,అధ్యాపక బృందం ఉన్నారు.

## దంచి కొట్టిన వాన-ఆగిన కరెంటు సరఫరా

**పుల్‌కల్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**
ఉమ్మడిపుల్‌కల్ మండంలోని ఆయాగ్రామాల్లో గురువారం ఉరుములతో కూడిన భారీవర్షంకురిసింది. రోడ్లపక్కకు ఉన్నచెట్లు కూలిపోవడం, విద్యుత్ స్తంభాలు నేలకరవడంతో విద్యుత్‌సరఫరాను నిలిపేశారు. మధ్యాహ్న సమయంలో ఒకగంటపాటు భారీవర్షంకురియడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ సరఫరా నిలిచిపోవడంతో ప్రభుత్వసేవలు ఆగిపోయాయి. పలు గ్రామాల్లో వరిపంట దెబ్బతింది.